





	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	38	25
భద్రాద్రి	40	26



రంజాన్‌మాసం
ఇఫ్తార్ (సా) : 6:28 (సోమవారం)
సహర్ (ఉ) : 4:41 (మంగళవారం)

సత్తుపల్లి మండలం చంద్రాయపాలెం గ్రామంలో అటవీ భూమికి సంబంధించి చంద్రాయపాలెం, బుగ్గపాడు గ్రామాలకు చెందిన గిరిజనుల మధ్య చెలరేగిన భూవివాదం చివరికి పోలీసులపై దాడికి దారి తీసింది. ఈ వివాదంపై విచారణకు వెళ్లిన సత్తుపల్లి పట్టణ సీఐపై బుగ్గపాడుకు చెందిన గిరిజనులు దాడిచేసి కొట్టారు. సత్తుపల్లి పట్టణ సీఐ కిరణ్‌తోపాటు ఆయనతో వెళ్లిన పోలీస్ సిబ్బందిపై కూడా దాడిచేశారు. బైక్‌పై వెళ్తున్న సీఐను కిందపడేసి మరీ మహిళలు కర్రలతో దాడిచేసి తీవ్రంగా కొట్టారు. ఈ సంఘటనలో సీఐతోపాటు పలువురు పోలీసు సిబ్బంది గాయపడ్డారు. సత్తుపల్లి పట్టణానికి చేరుకున్న సీఐ అందించిన సమాచారంతో కల్లూరు ఏసీపీ ఏ.రఘు ఆధ్వర్యంలో సబ్ డివిజన్ పోలీసులు బుగ్గపాడుకు వెళ్లి పోలీసులపై దాడికి పాల్పడిన గిరిజన యువకులు మహిళలను అదుపులోకి తీసుకుని సత్తుపల్లిస్టేషన్‌కు తరలించారు.



సీఐ కిరణ్‌పై దాడి చేస్తున్న గిరిజనులు

రణరంగం

- సత్తుపల్లి మండలం చంద్రాయపాలెం, బుగ్గపాడు గ్రామాల మధ్య భూవివాదం
- విచారణకు వెళ్లిన సత్తుపల్లి పట్టణ సీఐపై గిరిజనుల దాడి
- పోలీసుల లాఠీచార్జ్.. గిరిజన మహిళకు గాయం
- దాడికి పాల్పడినవారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- 35 మందిపై కేసు నమోదు

సత్తుపల్లి, మార్చి 31: చంద్రాయపాలెంలోని అడవిలో 400 ఎకరాల అటవీ భూమికి సంబంధించి 170ఎకరాల్లో 1999లో అటవీశాఖ తమ గ్రామానికి చెందిన గిరిజన కుటుంబాలకు చెట్టుపట్టా ఇచ్చిందని చంద్రాయపాలెం గిరిజనులు తెలిపారు. గతంలో యూకలిప్టస్ సాగుచేసి ఒక కటింగ్ అయిన తర్వాత తమకు వీఎస్ఎస్ చట్టం ప్రకారం అటవీశాఖ డబ్బులు చెల్లించిందని తెలిపారు. రెండేళ్ల క్రితం తిరిగి మరో కటింగ్ 30ఎకరాల్లో జరగ్గా ప్రస్తుతం దానికి సంబంధించి మొద్దులు తొలగించి వాటిని తగులబెట్టించారని, సదరు భూమి తాము సాగు చేసుకుంటుండగా బుగ్గపాడు, గాంధీనగర్, కాకర్లపల్లి, మొండివర్రె, నాగుపల్లి గ్రామాలకు చెందిన గిరిజనులు తమ భూములకు అడ్డు తగులుతూ కొన్నేళ్లుగా తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. తాజాగా ఆదివారం తాము పనుల్లో ఉండగా బుగ్గపాడు ప్రాంతానికి చెందిన గిరిజనులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమను అడ్డుకున్నారని, దీనిపై సత్తుపల్లి పోలీసులను ఆశ్రయించగా పట్టణ సీఐ కిరణ్ తమను చంద్రాయపాలెంలోనే ఉండాలని చెప్పి ఆయన బుగ్గపాడు గిరిజనుల వద్దకు వెళ్లి మాట్లాడే సమయంలో ఆయనపై దాడిచేసి విచక్షణారహితంగా కొట్టారని చంద్రాయపాలెం గిరిజనులు తెలిపారు.

తమకే హక్కు ఉందంటున్న బుగ్గపాడు గిరిజనులు

చంద్రాయపాలెం భూమికి సంబంధించి జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో తమ తాతలు, తండ్రులకు రెవెన్యూ శాఖ ద్వారా పట్టాలు జారీచేశారని బుగ్గపాడుకు చెందిన గిరిజనులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో 343సర్వే నెంబర్ నుంచి 359సర్వే నెంబర్ల మధ్య 400ఎకరాల భూమి ఉందని, అందులోనే అప్పట్లో పట్టాలు ఇవ్వగా వాటికి సంబంధించి పాస్‌బుక్కులు కూడా రెవెన్యూ శాఖ జారీచేసిందని, తమ పూర్వీకులు ఆ భూములను సాగు చేశారని చెబుతున్నారు. కానీ ఈ భూమిలో వనసంరక్షణ పేరుతో అటవీశాఖ యూకలిప్టస్ సాగుచేస్తూ ఫలసాయం అందరికీ ఇవ్వాల్సి ఉండగా చంద్రాయపాలెం గిరిజనులకు మాత్రమే ఇస్తోందని, ఇందులోనూ అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. తమకు హక్కు ఉన్న సదరు భూమిలో సాగు చేసుకునేందుకు బుగ్గపాడు నుంచి రాగా చంద్రాయపాలెం గిరిజనులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. దీనికి సంబంధించి తాము మానవ హక్కుల కమిషన్‌ను కూడా ఆశ్రయించినట్లు కారం మహేంద్ర అనే యువకుడు తెలిపాడు. చంద్రాయపాలెం, బుగ్గపాడు గిరిజనుల మధ్య ఈ భూవివాదం నడుస్తుంటే రెవెన్యూ, అటవీశాఖ అధికారులు లేకుండా సత్తుపల్లి సీఐ ఒక్కరే వచ్చి తమపై దాడికి దిగారని, తనను కొట్టడం వల్ల మహిళలు సీఐని అడ్డుకున్నారే తప్ప పోలీసులపై దాడిచేయలేదని బుగ్గపాడు గిరిజనులు చెబుతున్నారు.

దాడికి దారితీసిన పరిస్థితులు

బుగ్గపాడు గిరిజనులు వచ్చి తమ భూమిలో గొడవ చేస్తున్నారని చంద్రాయపాలెం గిరిజనులు పోలీసులకు సమాచారం ఇవ్వగా సత్తుపల్లి పట్టణ సీఐ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సివిల్ డ్రస్‌లో ఉన్న సీఐ ఆ ప్రాంతానికి వెళ్లగా అక్కడ బుగ్గపాడు గిరిజనులు మాత్రమే ఉన్నారు. వారితో మాట్లాడే సమయంలో వాగ్వాదం జరగడంతో సీఐపై దాడికి దారితీసింది. సీఐ గిరిజనులతో మాట్లాడుతున్న సందర్భంలో కారం మహేంద్ర అనే యువకుడిని మాట్లాడేందుకు పిలవగా అతడు రాకపోవడంతో అతడి సెల్‌ఫోన్ తీసుకుని కానిస్టేబుల్‌కు ఇచ్చి అతడిని కారులో ఎక్కించమని ఆదేశించడంతో గిరిజనులు పోలీసులను అడ్డుకునే క్రమంలో తోపులాట జరిగిందని కొందరు చెబుతుండగా, సీఐ తమ వద్దకు వస్తూనే కారం మహేంద్రను దూషిస్తూ సెల్‌ఫోన్ లాక్కొని కాలర్ పట్టుకుని తీసుకెళ్తుండగా అడ్డుకున్నామని ఈ సందర్భంగా గిరిజన మహిళలపై సీఐ దురుసుగా ప్రవర్తించారని బుగ్గపాడు గిరిజనులు ఆరోపించారు.

పోలీసుల అదుపులో గిరిజనులు

సీఐపై దాడిఘటనపై ఉన్నతాధికారులకు సమాచారం అందడంతో కల్లూరు ఏసీపీ రఘు ఆధ్వర్యంలో సబ్ డివిజన్ పోలీసులు వెళ్లి బుగ్గపాడు గిరిజనులను అదుపులోకి తీసుకున్నారు. సంఘటనా స్థలం నుంచి బుగ్గపాడు చేరుకున్న గిరిజనులు ఒక చెట్టుకింద నిల్చొని ఉండగా ఏసీపీ రఘు ఇతర పోలీసులు అక్కడికి చేరుకుని లాఠీలు ఝుళిపిస్తూ దొరికిన వారిని దొరికినట్లు అదుపులోకి తీసుకుని సత్తుపల్లి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా జరిగిన లాఠీచార్జ్‌లో నాగమణి అనే గిరిజన మహిళ తలకు తీవ్ర గాయమై రక్తస్రావమైంది.

వైరల్ అయిన వీడియోలు

చంద్రాయపాలెం అడవిలో సత్తుపల్లి పట్టణ సీఐ కిరణ్‌పై జరిగిన దాడి దృశ్యాలు సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి. బుగ్గపాడు గిరిజనుల వద్దకు వెళ్లిన సీఐపై మొదట దాడిజరినప్పుడు కానిస్టేబుళ్లు సీఐను వారినుంచి తప్పించి బైక్‌పై పంపించే ప్రయత్నం చేశారు. కానీ మహిళలు వెంటపడిమరి సీఐని బైక్‌పైనుంచి పడేసి కర్రలతో దాడి చేశారు. ఈ దాడికి సబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

35మందిపై కేసు నమోదు

చంద్రాయపాలెం ఘటనలో 35మందిని పోలీసులు అరెస్టు చేశారు. దాడికి ప్రధాన సూత్రధారుడిని కూడా అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. గతంలో భూ ఉద్యమాలను ప్రోత్సహించి ప్రస్తుతం బుగ్గపాడు ప్రాంత గిరిజనులకు అండగా ఉంటూ సీఐపై దాడి చేసినట్లు తెలుస్తోంది. ప్రధాన నిందితుడిని పట్టుకునేందుకు సత్తుపల్లి ప్రాంతంలో నిఘా ఉంచి జిల్లా సరిహద్దులో అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.



గిరిజనులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

గాయపడిన గిరిజన మహిళ నాగమణి

అన్నదాత నీటిపాట్లు

- ఖమ్మం రూరల్‌లో అడుగంటిన జలవనరులు
- ఎన్నెస్పీ ఆయకట్టులో ఎండుతున్న పంటలు
- కాపాడుకునేందుకు రైతుల భగీరథ ప్రయత్నం
- ఎన్నెస్పీ ప్రధాన కాల్వలో బావుల తవ్వకం
- మరో పదిరోజులు నీరందిస్తే పంటలు చేతికొచ్చే అవకాశం

ఖమ్మం రూరల్, మార్చి 31: నోటికాడికొచ్చిన పంటలు నీరులేక నిలువునా ఎండిపోతుండగా వాటిని కాపాడుకునేందుకు రైతులు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. బావులు, బోర్లలో నీరు అడుగంటడంతో పంటలను కాపాడుకునేందుకు అన్నదాతలు పడుతున్న కష్టం అంతా ఇంతా కాదు. ఖమ్మం రూరల్ మండలంలో చివరిదశకు వచ్చిన వరి, మొక్కజొన్న పంటను కాపాడుకునేందుకు రైతులు నాగార్జునసాగర్ ప్రధాన కాల్వలో బావులు తీసి వాటికి మోటార్లు అమర్చి తమ పంటలను కాపాడుకుంటున్నారు. నిబంధనల ప్రకారం సాగర్ ప్రధానకాల్వలో బావులు తీయకూడదు. కానీ తప్పనిసరి పరిస్థితుల్లో తమ పంటలను కాపాడుకునేందుకు బావులు తీయాల్సి వచ్చిందని రైతులు వాపోతున్నారు.

యాసంగిలో ఖమ్మం రూరల్ మండలంలో రైతులు వరి, మొక్కజొన్న పంటలను సాగు చేశారు. మండలవ్యాప్తంగా వరి సుమారు 2,500 ఎకరాలు, మొక్కజొన్న 3,660 ఎకరాల్లో సాగు చేశారు. అందులో సాగర్‌కాలువ ఆయకట్టు ఉన్న తెల్దారుపల్లి, ముత్తగూడెం, పల్లెగూడెం, పోలేపల్లి పరిధిలో సుమారు వరి 50ఎకరాలు, మొక్కజొన్న 60ఎకరాలలో సాగు చేశారు. అయితే సాగర్ నీరు రాకపోవడంతో పాటు తమ బావులు, బోర్లు ఎండిపోవడంతో పంటలు చివరి దశకు వచ్చిన తరుణంలో నీటి కొరత ఏర్పడింది. మరికొద్ది రోజులు నీరందిస్తే పంటలు చేతికొస్తాయి. కానీ జలవనరులు అడుగంటిపోవడంతో పొలాలు ఎండిపోతున్నాయి. ఈ దశలో పంట ఎండిపోతే పెట్టిన పెట్టుబడులు రాకపోగా అప్పులపాలవుతామని రైతులు ఆవేదన చెందారు. ఎలాగైనా పంటలను ఇంకా పదిరోజులు కాపాడుకుంటే చేతికొస్తాయని నీటికోసం అన్వేషించారు. ఈ క్రమంలో సాగర్ ప్రధాన కాల్వకు పక్కన ఉన్న రైతులు కాలువలో ఎక్స్‌కవేటర్‌తో బావులు తవ్వి వాటిలో ఊరిన నీటికి మోటార్ల ద్వారా పంటలకు అందిస్తున్నారు. పది రోజులు నీరందిస్తే పంటలు చేతికి వస్తాయని ఆ తరువాత కాల్వలో తీసిన బావులను తామే పూడ్చివేస్తామని రైతులు చెబుతున్నారు. రైతులు తీసిన ఈ బావులు పంటలతోపాటు మూగజీవాలకు కూడా దాహార్తిని తీరుస్తున్నాయి.



నీటికి సరఫరాకు అడ్డంకులు..

సాగర్‌ప్రధాన కాల్వ ద్వారా పాలేరు రిజర్వాయర్ నుంచి ఖమ్మం పట్టణ ప్రజలకు తాగు నీటిని విడుదల చేస్తారు. సాగర్ ప్రధాన కాల్వకు మున్నేరు ఎగువన ఎస్కేప్‌లాక్ ఉంటుంది. దీని ద్వారా నీటిని మున్నేరులోకి విడుదల చేస్తారు. ఆ నీటిని దానవాయిగూడెం ఫిల్టర్ బెడ్ల వద్దకు చేర్చి ఆ అక్కడ శుద్ధి చేసి ఖమ్మం పట్టణ ప్రజలకు అందిస్తారు. అదేవిదంగా ఇదే నీటిని కాల్వద్వారా ఖమ్మంలోని టేకులపల్లి వంతెన వరకు పంపించి అక్కడి తూము ద్వారా లకారం చెరువులోని తాగునీటి పథకానికి అందిస్తారు. అయితే సాగర్ కాల్వలో నీటిని విడుదల చేస్తే ముత్తగూడెం వద్ద రైతులు తీసిన బావులు, మట్టి కట్టలతో నీరు ఖమ్మం మున్నేరులోకి చేరడానికి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది.

సాగునీటి కల్పనలో ప్రభుత్వం విఫలం

- పంటలు కోల్పోయిన రైతులను ఆదుకోవాలి
- తాగు, సాగునీటి సమస్యలను సత్వరం పరిష్కరించాలి
- ఎంపీలు నామా, వద్దిరాజు, మాజీ మంత్రి పువ్వాడ
- పాలేరు రిజర్వాయర్‌ను పరిశీలించిన బీఆర్ఎస్ బృందం



పాలేరు రిజర్వాయర్ వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు

ఖమ్మం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి):జిల్లాలో సాగు, తాగునీరు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు ఆరోపించారు. సాగర్‌జలాలు లేకపోవడంతో కరువు పరిస్థితులు తలెత్తాయని పేర్కొన్నారు. ఆదివారం ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకుల బృందం పాలేరులోని రిజర్వాయర్‌ను పరిశీలించింది. అనంతరం నేలకొండపల్లి మండలంలో ఎండిపోయిన వరిపొలాలను పరిశీలించారు. తరువాత బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో తాగునీరు, సాగునీరు సమస్యలు లేవని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే నీటి సమస్య వచ్చిందన్నారు. పంటలు ఎండిపోయి రైతులు నష్టపోతునా ప్రభుత్వం నుంచి ఎవరూ పట్టించుకోవటం లేదని రైతు బిడ్డగా బాధపడుతున్నానని పేర్కొన్నారు. రాబోయే రెండు నెలల్లో రాష్ట్రంలో తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడబోతోందన్నారు. గత ఎన్నికల్లో పొరపాటున కాంగ్రెస్‌కు ఓటు వేసి బాధ పడుతున్నామని రైతులే ఆవేదన వ్యక్తం చేస్తున్నారని నామా పేర్కొన్నారు. భారీగా పంటలు ఎండిపోయినా చూడటానికి అధికార పార్టీ నేతలు రావటం లేదన్నారు. కేసీఆర్ పాలనలో ధాన్యం ఉత్పత్తిలో రాష్ట్రం నంబర్‌వన్‌గా ఉంటే ఇప్పుడు రైతులు పంట పండించే పరిస్థితి లేదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే రైతుల సమస్యపై పోరాడుతామన్నారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ కేసీఆర్ అంటే కాల్వలు, చెరువులు, రిజర్వాయర్లని పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జలవనరులు కళకళలాడాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సాగర్ నిర్వహణను కృష్ణాబోర్డుకు అప్పగించారని, కృష్ణా జలాలను ఆంధ్రా తరలించకపోవటం వల్ల సాగర్‌లో నీటి సమస్య ఏర్పడిందన్నారు. పంటలు నష్ట పోయిన ప్రతి రైతుకు రూ.30వేల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఖమ్మం నగరంలో గత పదేళ్లలో తాగునీటిఇబ్బంది లేదని, కానీ నేడు ప్రధాన సమస్యగా మారిందన్నారు.ప్రజలు కొత్తగా బోర్లు వేసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. 2,600 గ్రామాలు మిషన్‌భగీరథ నీరు అందక సమస్య ఎదుర్కొంటున్నాయన్నారు. రాజ్యసభ సభ్యుడు, వద్దిరాజు రవి చంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూధన్, సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యలు మాట్లాడుతూ జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా సాగునీటి సమస్య గురించి పట్టించుకోవటం లేదన్నారు. తక్షణం పాలేరు రిజర్వాయర్ నింపి రైతులకు సాగునీటితోపాటు ప్రజలకు తాగునీటిని అందించాలన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌ను గెలిపించి తీరతారన్నారు. సమావేశంలో మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు బానోత్ మదన్‌లాల్, హరిప్రియ మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు కోనేరు చిన్ని, ఖమ్మం మేయర్ నీరజ తదితరులు పాల్గొన్నారు.



సత్యస్వరూప తేజ (ఫైల్)

అరుదైన వ్యాధితో మహిళ మృతి

అశ్వారావుపేట,మార్చి 31: అశ్వారావుపేట మండలం, సున్నంబట్టి గ్రామానికి చెందిన పల్లికొండ అప్పారావు-నాగమణి దంపతుల కవల కుమార్తెల్లో ఒకరైన సత్యస్వరూప తేజ(32) సిస్టమిక్ స్క్లోరోసిస్ అనే అరుదైన వ్యాధితో బాధపడుతూ ఆదివారం మృతి చెందింది. సత్యస్వరూప తేజకు సిస్టమిక్ స్క్లోరోసిస్ (స్క్లోరోడెర్మా)వ్యాధి ఉన్నట్టు 2016లో గుర్తించారు. ఈ వ్యాధి భారిన పడిన వారికి శరీరంలోని అన్ని అవయవాలు ఒక్కోటిగా కుచించుకుపోతాయి. ఆహారనాలం, నోరు, ఊపిరితిత్తులు ఇలా ప్రతి అవయవం చిన్నగా కుంచించుకుపోయాయి. తల్లితండ్రులు ఈ వ్యాధికి ఏలూరు ఆశ్రమ ఆసుపత్రిలో ఐదు సంవత్సరాలు చికిత్స చేయించారు. గత మూడేళ్లుగా హైదరాబాదులోని నేషనల్ యునాని ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. పీజీ పూర్తి చేసిన సత్యస్వరూప ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో ఉండేది. కానీ అరుదైన వ్యాధితో మృతి చెందటంతో ఆ గ్రామంలో విషాదం నెలకొంది. తమ స్తోమతకు మించి రూ.లక్షలు వెచ్చించి వైద్యం చేయించినా తమ బిడ్డను కాపాడుకోలేకపోయామని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



- భారీగా పడిపోయిన రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం
- గత ఏడాదికంటే రూ.30 కోట్లు తక్కువ

4



పన్నుల వసూళ్లలో ఇల్లెందు భేష్

- ఉమ్మడి జిల్లాలో మొదటిస్థానం..
- రాష్ట్రస్థాయిలో రెండో స్థానం
- ఖమ్మం నగరంలో రూ.30.80కోట్లు వసూళ్లు

4



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల

వానాకాలంలో నీరున్నా.. ఎందుకు ఇవ్వలేదు?

- అసెంబ్లీ ఎన్నికల ముందు నీటిని వృథా చేసింది నిజం కాదా..
- పదేళ్లలో ఒక్కరైతుకైనా నష్టపరిహారం ఇచ్చారా..
- ప్రజలు బీఆర్ఎస్‌ను నమ్మే రోజులు పోయాయి
- రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు

4

ప్రచార పర్వంలోకి బీఆర్ఎస్

- నియోజకవర్గాల వారీగా నేతల పర్యటనలు
- ఎన్నికల వ్యూహంపై కసరత్తు

ఖమ్మం, మార్చి 31 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారపర్వంలోకి దిగబోతోంది. నియోజకవర్గాల వారీగా ఎన్నికల ప్రచారంతో పాటు నాయకులు, కార్యకర్తల సమావేశాలు నిర్వహించాలని, ఆయా సామాజిక సంఘాలనేతలను కలవాలని నిర్ణయించింది. బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఆదివారం పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు పువ్వాడ అయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు ఇతర నాయకులు హాజరయ్యారు. లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేనాటికి ఖమ్మం లోక్‌సభ పరిధిలోని 7అసెంబ్లీ నియోజకవర్గాల్లో సభలు, సమావేశాలు నిర్వహించాలని, ప్రచార కార్యక్రమాలు ముమ్మరం చేయాలని నిర్ణయించారు. నియోజకవర్గాల వారీగా ఎన్నికల ప్రచార క్యాలెండర్‌ను రూపొందించారు. ఖమ్మం నగరంతో పాటు జిల్లాలోని పలురంగాల ప్రముఖులను కలవాలని, వారి మద్దతును పొందాలని సమావేశంలో నిర్ణయించారు. తాగునీటి, సాగునీటి సమస్యలను, బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరోసారి గుర్తు చేయాలని నిర్ణయించారు. బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు ఎన్నికల ప్రచారంలో భాగంగా పర్యటనలు సాగించాలని కూడా ఈ సందర్భంగా నేతలు విజ్ఞప్తి చేశారు.



పొంగులేటి



తుమ్మల

'లోక్‌సభ' ఎన్నిలకు కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌ల నియామకం

ఖమ్మానికి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మహబూబాబాద్‌కు తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాలకు మంత్రులను ఇన్‌చార్జ్‌లుగా నియమించింది. ఖమ్మానికి రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని నియమించగా, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఈ ఇద్దరు మంత్రులు జిల్లాలో రెండు లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ విజయం కోసం పూర్తిస్థాయిలో బాధ్యతలు తీసుకుని ప్రచార పర్వాన్ని సాగించనున్నారు.

పొలం పనులకు ముందు రైతులు భూసార పరీక్షలు చేసుకుంటే అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంది. ఈ పరీక్షల ద్వారా భూమి స్వభావం, మృత్తిక ఏ రకానికి చెందినదో, దానిలో ఉన్న పోషక పదార్థాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుస్తుంది. వాటిని బట్టి రైతులు పంటలు సాగు చేస్తే వృథా ఖర్చుల నుంచి విముక్తి పొందవచ్చు. భూసార ఫలితాల్లో ఏ భూమి తేలిక నేల, బరువు నేల తదితర విషయాలు తెలుస్తాయి. వ్యవసాయ భూముల్లో సహజంగా ఉండే పోషక పదార్థాలతోపాటు అదనంగా సేంద్రియ ఎరువులు అందేలా చర్యలు తీసుకుంటే అధిక దిగుబడి సాధించవచ్చు.



- మట్టి సేకరణకు మార్చి నుంచి మే నెలలు అనుకూలం
- పరీక్ష ఫలితాలతో వృథా ఖర్చులకు చెక్
- నాణ్యమైన దిగుబడుల సాధనకు సరైన మార్గం
- సత్తుపల్లి, ఖమ్మంలో పరీక్ష కేంద్రాలు
- విత్తన పరీక్షల ఉమ్మడి జిల్లాకు ఖమ్మంలోనే...

పంటలకు రక్ష భూసార పరీక్ష

ఖమ్మం వ్యవసాయం, మార్చి 31: జిల్లాలో ఖమ్మం, సత్తుపల్లిలో భూసార పరీక్ష కేంద్రాలు రైతులకు అందుబాటులో ఉన్నాయి. గత సంవత్సరం వరకు ఈ కేంద్రాల్లో 463 మట్టి నమూనాలను, 176 నీటి నమనాలను పరీక్షించి రైతులకు తగిన సూచనలు చేశారు. 'సాగు-బాగు' ఎన్‌జీవో ఆధ్వర్యంలో మరో 1000 నమూనాలు పరీక్షచేయించారు. వచ్చే వానాకాలానికి సంబంధించి సత్తుపల్లి కేంద్రానికి 2400 నమూనాలను పరీక్షించాలని లక్ష్యంగా నిర్ణయించారు.వీటిని అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నమూనాలు సేకరిస్తారు. ఖమ్మం కేంద్రానికి ఇంకా లక్ష్యాన్ని నిర్దేశించలేదు. రైతులు నేరుగా నమూనాలు తీసుకువెళితే మట్టి నమూనాకు రూ.10, నీటి నమూనాకు రూ.15 రుసుం తీసుకుంటారు.

ఎంతో ఉపయోగం..

పంటలు సాగు చేసే ముందు రైతులు భూసార పరీక్షలు చేయించుకుంటే నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చు. పరీక్షా ఫలితాల ఆధారంగా సాగు చేస్తే వృథా ఖర్చులను తప్పించుకోవచ్చు. వ్యవసాయ భూముల్లో సహజంగా ఉండే పోషక పదార్థాలతో పాటు అదనంగా సేంద్రియ ఎరువులు అందేలా

విత్తన పరీక్షలు కూడా..

ఖమ్మం, భద్రాద్రి జిల్లాలో రాయితీ విత్తనాలకు సంబంధించిన విత్తన పరీక్షలను కూడా ఈ రెండు కేంద్రాలలో చేస్తున్నారు. ఏడాది కాలంగా ఇప్పటి వరకు రాయితీ విత్తనాలయిన జీలుగ, పిల్లిపెసర, జనుము తదితర విత్తనాల 565 నమూనాలకు పరీక్షలు చేశారు.

చర్యలు తీసుకుంటే అధిక దిగుబడి పొందవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. భూసారాన్ని కాపాడుకోవడానికి భూసార పరీక్షలు ఎంతో ఉపయోగకరిస్తాయి. సుస్థిర దిగుబడి పొందడానికి రైతులు రెండేళ్లకు ఒకసారి భూసార పరీక్షలు చేయించాలి. భూసారాన్ని బట్టే రైతులు తగిన పంటలను ఎంచుకుని సాగుచేయాలి. పరీక్షల ద్వారానే ఏ పంటకు ఎంత ఎరువు వేయాలి. సాగులో ఏ పద్ధతులు అవలబించాలనే విషయం తెలుస్తుంది.

నమూనాలను సేకరించే విధానం..

పంట లేని సమయంలోనే భూసార పరీక్షలకు మట్టి సేకరించాలి. నేల పొడిగా ఉన్నప్పుడు పొలం ఆరి ఉన్నప్పుడు మాత్రమే తీసుకోవాలి. సరిగ్గా చెప్పాలంటే మార్చి నుంచి మే నెల మధ్య సేకరించాలి. పండ్ల తోటలు సాగు చేసే రైతులు చెట్లకు ఎరువు వేయక ముందే మట్టి నమూనాలు తీసుకోవాలి. మట్టి వెళ్లే లోతు వరకు, ఏక వార్షిక పంటలకు 15 నుంచి 30 సెం.మీ. లోపు మట్టి నమూనాలను సేకరించాలి. పొలంలోని గట్ల వద్ద, పంట కాల్వల్లో సేకరించకూడదు. మొక్కలు, చెట్ల కింద, చెట్ల పక్కన మట్టిని సేకరించకూడదు. కంపోస్టు, పశువుల ఎరువుల కుప్పలు ఉంచిన నేల నుంచి నమూనాలు పనికిరావు.



ఎన్నికల్లో అక్రమాలపై స్పందించు !

- అందుబాటులో డయల్ 1950 టోల్‌ఫ్రీ
- సీ విజిల్‌లోనూ ఫిర్యాదుకు అవకాశం



కలెక్టరేట్‌లో 24గంటల పాటు పనిచేస్తున్న కంట్రోల్ రూం

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 28: ఎన్నికల సందర్భంగా ఓటర్ల సమస్యలు, సలహాలు, ఫిర్యాదుల పరిష్కారం కోసం కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 1950 టోల్‌ఫ్రీ నెంబరుకు కాల్స్ వస్తున్నాయి. జిల్లా ఎన్నికల అధికారి వీపీ గౌతమ్ ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లో మార్చి 16నుంచి 1950 నెంబర్ ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇక్కడి సిబ్బంది 24 గంటల పాటు మూడు షిఫ్టుల్లో ఐదుగురు సిబ్బంది పనిచేస్తున్నారు. వీరందరికీ నోడల్ అధికారిగా సీపీవో శ్రీనివాస్ వ్యవహరిస్తూ వచ్చిన కాల్స్‌కు ఎప్పటికప్పుడు పరిష్కారాన్ని చూపుతున్నారు.

31 ఫోన్‌కాల్స్..

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితాలో తమ పేరు ఉందా..? లేదా...? లేకపోతే ఎవరిని సంప్రదించాలి? ఇలాంటి వివరాలను తెలుసుకోవాలంటే మీరు 1950 కంట్రోల్ రూంలో సిబ్బందిని సంప్రదించవచ్చు. పోలింగ్ మే 13న జరగనుంది. ఇప్పటి వరకు జిల్లా కేంద్రంలో 1950 విభాగానికి 31 మంది కాల్స్ చేశారు. వీరందరికీ అక్కడి సిబ్బంది పరిష్కారాన్ని చూపించారు.

సీ విజిల్ యాప్‌కు ఫిర్యాదులు..

ఎన్నికల్లో అక్రమాలను నిరోధించేందుకు సీ విజిల్ యాప్‌ను ఎన్నికల సంఘం అందుబాటులోకి తీసుకొచ్చింది. సెల్‌ఫోన్‌లో సీ విజిల్ యాప్ ద్వారా ఫోటో లేదా వీడియో తీసి పంపిస్తే తక్షణమే 20 నిమిషాల్లో అక్కడికి ఎన్నికల అధికారులు వచ్చి పరిష్కారానికి కృషిచేస్తారు. జిల్లా కేంద్రంలో సీ విజిల్ హెల్ప్ లైన్‌ను కూడా ఏర్పాటు చేశారు. మార్చి 16నుంచి ఇప్పటి వరకు సీ విజిల్ యాప్‌కు 12 ఫిర్యాదులు అందాయి.

ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలి
శ్రీనివాస్, కంట్రోల్‌రూం అధికారి

ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు ఎన్నికల నేపథ్యంలో జరిగే అక్రమాలను ఫిర్యాదు చేసేందుకు 1950, సీ విజిల్ యాప్‌పై అవగాహన కల్పించుకోవాలి. సమీపంలో జరిగే అక్రమాలను ఎన్నికల అధికారులకు తెలపాల్సిన బాధ్యత భారత పౌరుడిగా మనందరికీ ఉంటుంది. ఏ సందేహాలు ఉన్నా కంట్రోల్ రూంకు ఫోన్ ద్వారా పిర్యాదు చేయవచ్చని తెలిపారు.

క్రీస్తు చూపిన మార్గంలోనే నడవాలి

- డోర్నకల్ అధ్యక్ష మండల పీఠాధిపతి పద్మారావు



ఈస్టర్ సందేశాన్ని వినిపిస్తున్న పద్మారావు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మార్చి 31: యేసుక్రీస్తు చూపిన మార్గంలోనే క్రైస్తవుల మనుగడ సాధ్యమవుతుందని డోర్నకల్ అధ్యక్ష మండల పీఠాధిపతి, మెదక్ మోడరేటర్ ది రైట్ రెవ.డాక్టర్ కె.పద్మారావు అన్నారు. ఆదివారం తెల్లవారుజామున కొత్తగూడెం సీఎస్ఐ సెయింట్ అండ్రూస్ ర్చ్‌లో ఈస్టర్ వేడుకలను నిర్వహించగా ముఖ్య అతిథిగా పాల్గొని బైబిల్ సందేశాన్ని భక్తులకు అందించారు.

వేర్వేరుగా ఈస్టర్ వేడుకలు.. కొత్తగూడెం రోమన్ క్యాథలిక్ మిషనరీ(ఆర్‌సీఎం) ప్రొవిన్షల్ ఫాదర్, ప్యారీస్ ప్రిస్ట్ ధనరాజ్ కొవ్వొత్తిని వెలిగిస్తూ ప్రత్యేక ఆరాధనను ఆదివారం తెల్లవారుజామున ప్రారంభించారు. ఏ-పవర్‌హౌస్ బస్తీలోగల బేతెస్థ ప్రేయర్ హాల్‌లో పాస్టర్ విజయశరత్ యేసు ప్రభువు చూపిన శాంతి మార్గాన్ని ప్రతి ఒక్కరు ఆచరణలో పెట్టాలని ఆయన చూపిన మార్గంలో నడవాలని భక్తులను కోరారు. ఇండిపెండెంట్ చర్చ్ పాస్టర్స్ ప్రమోద్‌కుమార్, ఫ్రాన్సిస్, బాబురావు, రమేష్, శ్యామ్‌కుమార్ ప్రార్ధనలు నిర్వహించారు.

యాదన్న కన్నుమూత.. విప్లవోద్యమాలకు తీరని లోటు

- నివాళులర్పించిన పలు పార్టీన నాయకులు

ఇల్లెందు, మార్చి 31: తుది శ్వాసవరకు విప్లవోద్యమాలకే యాదన్న జీవితాన్ని దారపోశారని, ఆయన మృతి విప్లవ పార్టీకి తీరన లోటని ప్రజాపంథ, న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు నివాళులర్పించారు. శనివారం రాత్రి ఆయన ఇల్లెందులో అనారోగ్యంతో మృతిచెందగా. ఆదివారం గండి యాదన్న అంత్యక్రియలు జరిగాయి. ఈ సందర్భంగా మాస్‌లైన్ ప్రజాప్రంథ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడినర్సయ్య, రాష్ట్ర నాయకులు కచ్చెలరంగారెడ్డి, చంద్ర అరుణ, న్యూడెమొక్రసీ రాష్ట్ర నాయకులు అవునూరి మధు, తుపాకుల నాగేశ్వరావు, ఎన్డీ చంద్రన్న వర్గం నాయకులు సీతరామయ్య, రాసుద్దీన్, రాంమ్‌సింగ్, ఏజెన్సీ గౌడ సంఘ రాష్ట్ర కార్యదర్శి నారటి వెంకన్న, టీడీపీ నాయకులు ముద్రగడ వంశీ, బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొల్లి సంజీవరెడ్డి, నాగరాజు, సీపీఐ జిల్లా నాయకులు నబి, కిరణ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు దొగ్గదానియల్, టీఆర్ఎస్ పట్టణ నాయకులు వెంకటేశ్వరావు,



అంతిమయాత్రలో మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

సీపీఐ మండల, పట్టణ కారదర్శి నాగయ్య, దేవర కొంట శంకర్‌చ తదితరులు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. అంతిమయాత్ర సందర్భంగా మృతదేహాన్ని పటేల్ చౌక్‌లోని, ప్రజాపంథ కార్యాలయంలో ఉంచి పార్టీ నాయకులు సంతాప సభ నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులు గండి యాదన్న ఏజెన్సీ ప్రాంతాల ప్రజలకు అందించిన సేవలను నిర్బంధాలను బీతిల్లకుండా విప్లవోద్యమాలకు చేసిన కృషిని వివరించారు. అంతిమ యాత్రలో వివిధ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రాణాలను కాపాడిన పూర్వ విద్యార్థులు

ఏన్కూరు, మార్చి 31: ప్రాణప్రాయ స్థితిలో ఉన్న నిరుపేద విద్యార్థికి వైద్య ఖర్చులు అందించి స్నేహితులు ఆదర్శంగా నిలిచారు. తూతక్క లింగన్న పేటకు చెందిన ఎస్కే నయీం ఏన్కూర్ గురుకులంలో ఆరో తరగతి చదువుతున్నాడు. మార్చి 23న అకస్మాత్తుగా ఊపిరితిత్తుల సమస్యతో ప్రాణపాయ స్థితిలోకి వెళ్లాడు. వెంటనే తల్లి ఆశా హైదారాబాద్‌లోని చేర్పించింది. వైద్యం అందించేందుకు చేతిలో చిల్లిగవ్వ లేక దిక్కుతోచని స్థితిలో ఉన్న నయీంకు గురుకుల పాఠశాల అల్యూమిని పూర్వ విద్యార్థులు వైద్య ఖర్చుల కోసం సుమారు రూ.లక్షా13వేలు అందజేసి చిన్నారి ప్రాణాలను కాపాడారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన నయీంను ఆదివారం పూర్వ విద్యార్థులు, పాఠశాల ప్రిన్సిపాల్ తుడి శ్రీనివాసరెడ్డి,మోదుగు జోగారావు, ఆర్విసేని కృష్ణ, చారి, కుటుంబరావు తదితరులు పరామర్శించారు.

స్నేహితుల ఆర్థిక సాయం..

ఖమ్మం రూరల్, మార్చి 31: మహబూబాబాద్ జిల్లా చిన్నగూడురు మండలం, జయ్యారం గ్రామానికి చెందిన బత్తిని రమేష్ కుటుంబంతో కొంత కాలంగా ఖమ్మం రూరల్ మండలంలోని పల్లెగూడెంలో నివాసం ఉంటున్నారు. ఇటీవల పలు కారణాలతో రమేష్ అప్పులపాలయ్యాడు. విషయం తెలుసుకున్న జయ్యారంలోని స్నేహితులు రూ.20 వేల సాయాన్ని ఆదివారం అందజేశారు.

9నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

- ఉత్సవాలకు సిద్ధమైన జమలాపురం

ఎర్రుపాలెం, మార్చి 31: ఎర్రుపాలెం మండలం జమలాపురంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఏప్రిల్ 9 నుంచి 17వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. 9 రోజుల పాటు వేడుకల నిర్వహణకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. క్రీ.శ. 500వ దశాబ్దంలో శ్రీ కృష్ణ దేవరాయులు దర్శించుకొని తరించిన పరమ పావన క్షేత్రంగా విరాజిల్లుతోంది.

శ్రీవారి ఆలయంలో దాతల సహకారంతో ప్రత్యేక పూజలు, నిత్యాన్నదానం, వసంత నవరాత్రి, శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. కేవలం పరిపాలన విభాగానికి తప్ప, దేవాదాయశాఖ నుంచి ఉత్సవాలకు నయా పైసా ఖర్చు పెట్టరు. గాలి గోపురం, యాగశాల, చుట్టూ షెడ్ల నిర్మాణం, గరుడాలయం, కోనేరు తాగునీటి వసతి, మెట్లపై షెడ్డు నిర్మాణం, ఆవరణలో అన్నదాన సత్రం, వేలం పాట కొట్లకు, శ్రీనివాస, శేషాసాయి, పద్మావతి కాంప్లెక్స్‌ల నిర్మాణం, తల నీలాల భవనం, కల్యాణ మండపం, చారుగుండ్ల వసతి గృహం అన్నీ దాతలే సమకూర్చారు. ధార్మిక



భవనం, శ్రీవారి కల్యాణం నిర్వహించేందుకు వకుళాభరణం స్టేడియం నిర్మాణంలో ఉన్నాయి. దశాబ్ద కాలంగా వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఖమ్మం నగరానికి చెందిన కే ఎస్ఆర్ గ్రానైట్స్ అధినేత తుళ్లూరి కోటేశ్వరరావు, నిర్మల కుమారి దంపతులు సింసభాగం ఖర్చు వెచ్చిస్తున్నారు. శ్రీవారి కల్యాణం, గ్రామోత్సవం, శ్రీవారి తెప్పోత్సవాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా, కన్నుల పండుగగా నిర్వహిస్తున్నారు.

వానాకాలంలో.. నీరెందుకివ్వలేదు?

- రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల

నేలకొండపల్లి, మార్చి31: సాగర్‌లో నీరున్నా వానాకాలం పంటకు రైతులకు ఎందుకు సాగు నీరందించలేక పోయారని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు బీఆర్ఎస్ నాయకులను సూటిగా ప్రశ్నించారు. ఆదివారం బీఆర్ఎస్ నాయకులు మండలంలో ఎండిపోయిన వరి పొలాలను పరిశీలించి కాంగ్రెస్ ప్రభుత్వంపై చేసిన విమర్శలను రాయల తీవ్రంగా ఆక్షేపించారు. పది సంవత్సరాలలో ఏనాడైనా రైతు గురించి పట్టించుకున్న పాపాన పోయారా అని సూటిగా ప్రశ్నించారు. పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో సీతారామ ప్రాజెక్టును పూర్తి చేయటానికి ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. చేసేదంతా చేసి పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తుండటంతో బీఆర్ఎస్ నాయకులకు ఇప్పుడు రైతులు గుర్తుకు రావటం హాస్యాస్పదమన్నారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా రుణమాఫీ చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమని, రైతులకు ఉచిత విద్యుత్‌ను ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమని రాయల నాగేశ్వరరావు గుర్తుచేశారు. ఈ సమావేశంలో నెల్లూరి భద్రయ్య, వజ్జా రమ్య, శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, వెన్నపూసల సీతారాములు, బొడ్డు బొందయ్య, గెల్లా జగన్మోహన్‌రావు, యడవల్లి సైదులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో హెచ్ఎం అరెస్టు

మధిరరూరల్, మార్చి 31: బాలికలతో అనుచితంగా ప్రవర్తించిన కేసులో హెచ్ఎంను పోలీసులు అరెస్ట్ చేశారు. మధిర మండల పరిధిలోని మడుపల్లి హైస్కూల్ హెచ్ఎంపై ఆపాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈమేరకు పోక్సో కేసు నమోదు చేసి హెచ్ఎం సాధు సమాధానంను రిమాండ్‌కు తరలించినట్లు మధిర టౌన్ ఎస్ఐ సంధ్య తెలిపారు.

ఎలాంటి బదిలీ ఉత్తర్వులు అందలేదు..

వైరా, మార్చి 31: తనకు ఎలాంటి బదిలీ ఉత్తర్వులు రాలేదని వైరా ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్ కరుణ స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్లలో నిబంధనల ఉల్లంఘన ఆరోపణల నేపథ్యంలో ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్ కరుణ బదిలీ అయిన సమాచారం వెలుగులోకి వచ్చింది. అయితే పత్రికల్లో వచ్చిన కథనాలపై ఆమె స్పందించారు. తనకు ఎలాంటి బదిలీ ఉత్తర్వులు రాలేదని ఒకవేళ ఆఉత్తర్వులు వచ్చినట్లయితే తానే తెలియజేస్తానని పేర్కొన్నారు.

పన్నుల వసూళ్లలో ఇల్లెందు భేష్

- ఉమ్మడి జిల్లాలో మొదటిస్థానం..
- రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో నిలిచిన మునిసిపాలిటీ
- ఖమ్మం నగరంలో రూ.30.80కోట్లు వసూళ్లు

ఇల్లెందుటౌన్/ఖమ్మం కార్పొరేషన్, మార్చి 31: ఇంటిపన్ను వసూళ్లలో ఇల్లెందు మున్సిపాలిటీ రాష్ట్రస్థాయిలో ముందంజలో నిలిచింది. ఉమ్మడి జిల్లాలో ఉన్న అన్ని మున్సిపాలిటీల కంటే ఇల్లెందు మున్సిపాలిటి ప్రథమస్థానంలో నిలవగా రాష్ట్రంలో రెండోస్థానంలో నిలిచింది. ఇల్లెందు మునిసిపాలిటీ వందకు వందశాతం పన్నుల వసూళ్లకు అతి చేరువలో ఉండడం గమనార్హం. రాష్ట్రస్థాయిలో సిరిసిల్ల మున్సిపాలిటీలో రూ.5.56కోట్లకు గాను, రూ.5.49కోట్ల వసూలు చేసి, 98.73 శాతంలో మొదటి స్థానంలో ఉండగా, ఇల్లెందు మున్సిపాలిటీ రూ.1.90కోట్లకు గాను, రూ.1.80కోట్లు పన్నులు వసూలు చేసి 94.82 శాతంలో రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో 10 మున్సిపాలిటీల్లో 91నుంచి 98శాతం వరకు పన్నులు వసూళ్లయ్యాయి. ఇల్లెందు మునిసిపాలిటీలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఇంటింటికి వెళ్లి పన్నులను వసూలు చేశారు. మునిసిపల్ కమిషన్, మేనేజర్‌తో పాటు చైర్మన్ పన్నుల వసూళ్లను సమీక్షించారు. సీడీఎంఏ విడుదల చేసిన జాబితాలో ఇల్లెందు రెండో స్థానంలో నిలవడంతో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మునిసిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇంటి పన్నులు వసూళ్లు చేసిన అధికారులు, సిబ్బంది కృషి అభినందనీయమన్నారు. ఇంటిపన్ను వసూళ్లకు సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఖమ్మం నగరంలో రూ.30.80కోట్లు వసూళ్లు

ఖమ్మం నగరపాలకసంస్థలో ఆర్థిక సంవత్సరం చివరిరోజైన ఆదివారం రాత్రి వరకు రూ.30.80కోట్ల పన్నులు వసూలయ్యాయి. ఆదివారం ఒక్కరోజే రూ.2.23కోట్లు వసూలు చేసి రికార్డు సృష్టించారు. ఆస్తిపన్నుల వసూళ్ల లక్ష్యం రూ.32.81కోట్లు కాగా ఆదివారం రాత్రి వరకు 30.80కోట్లు వసూలు చేయగలిగారు. చెక్కులకు సంబంధించిన లెక్కలు కూడా కలిపితే ఈ మొత్తం పెరిగే అవకాశం ఉందని రెవెన్యూ అధికారులు తెలిపారు. ఖమ్మం కార్పొరేషన్‌లో భారీమొత్తంలో పన్నులు వసూలు చేయటం ఇదే తొలిసారి. పన్నుల వసూళ్ల కోసం కమిషనర్ ఆదర్శ్‌సురభి 30మంది ప్రత్యేక అధికారులను నియమించటం సత్ఫలితాన్నిచ్చింది. అంతేకాకుండా కమిషనర్ స్వయంగా బకాయిదారుల వద్దకు వెళ్లి మాట్లాడారు. ఇక రెవెన్యూ విభాగానికి చెందిన బిల్ కలెక్టర్లు ఉదయం నుంచి రాత్రి వరకు డివిజన్లలో తిరుగుతూ పన్నులు వసూలు చేశారు. సహాయ కమిషనర్ సంపత్‌కుమార్‌తో పాటు రెవెన్యూ అధికారులు శ్రీనివాసరావు తదితరులు ప్రతి ఇంటిని సందర్శించారు. ముఖ్యంగా ఆస్తిపన్ను వడ్డీపై 90శాతం రాయితీని ముమ్మురంగా ప్రచారం చేయటంతో పన్నులు భారీగా వసూలయ్యాయి.

తగ్గిన రాబడి..

- భారీగా తగ్గిన రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం
- గత ఏడాదికంటే రూ.30కోట్లు తక్కువ

ఖమ్మం కార్పొరేషన్, మార్చి30: ప్రభుత్వానికి అధికంగా ఆదాయం సమకూర్చే శాఖల్లో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కీలకమయింది. ఈ ఏడాదిమాత్రం ఆ శాఖ నుంచి వచ్చే ఆదాయం భారీగా తగ్గింది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని 11 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయా నుంచి ఈ ఏడాది ఆశించినంత ఆదాయం రాలేదు. గత ఏడాది కంటే రూ.30కోట్లు ఆదాయం తగ్గింది. ఉభయ జిల్లాల్లో గతఏడాది రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.227.34కోట్ల ఆదాయం రాగా, ఈ ఏడాది రూ.197.31కోట్ల ఆదాయం మాత్రమే వచ్చింది. రియల్ వ్యాపారం మందగించటం, అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కోడ్ అమలులోకి వచ్చి నగదు లావాదేవీలు పరిమితి రూ.50వేలకు మాత్రమే పరిమితం కావటం, బ్యాంక్ లావాదేవీలపై నిఘా ఉంచటం తదితర కారణాలతో రిజిస్ట్రేషన్లు మందకొడిగా సాగాయి. దీంతో ఏకంగా రూ.30కోట్ల ఆదాయం తగ్గిపోయింది.

ఉభయ జిల్లాల్లో 11 కార్యాలయాలు

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో 11 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. అందులో ఖమ్మంలో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం ఉండగా జిల్లాలోని ఖమ్మంరూరల్, కూసుమంచి, వైరా, సత్తుపల్లి, కల్లూరు, మధిరలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం, భద్రాచలం, ఇల్లెందు, బూర్గంపాడులలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. గత ఏడాది మార్చి వరకు ఆయా కార్యాలయాల్లో 47,102 డాక్యుమెంట్లు జరగగా, ఈ ఏడాది మార్చి వరకు 43,651 డాక్యుమెంట్లు జరిగాయి.

భారీగా తగ్గిన రిజిస్ట్రేషన్ల ఆదాయం

జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం ఖమ్మంలో ఈఏడాది రిజిస్ట్రేషన్ల ద్వారా

ఉమ్మడి జిల్లాలో ఆదాయం ఇలా

కేంద్రం	గతేడాది డాక్యుమెంట్లు	ఆదాయం (కోట్లలో)	ఈ ఏడాది డాక్యుమెంట్లు	ఆదాయం (కోట్లలో)
ఖమ్మం	15416	108.65	13513	92.75
వైరా	4350	12.12	4474	13.57
ఖమ్మంరూరల్	6558	25.84	5001	21.75
కూసుమంచి	5842	14.64	6067	13.13
మధిర	3469	11.62	3535	10.99
సత్తుపల్లి	2349	9.32	2597	8.43
కల్లూరు	2181	5.12	2310	4.30
కొత్తగూడెం	5816	34.64	5110	27.30
భద్రాచలం	135	4.90లక్షలు	132	4.38లక్షలు
బూర్గంపాడు	343	1.28	261	72 లక్షలు
ఇల్లెందు	643	4.04	651	4.28

వచ్చే ఆదాయం భారీగా తగ్గింది. గతేడాది మొత్తం 15,416 డాక్యుమెంట్లు జరిగి రికార్డు స్థాయిలో రూ.108.65 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ ఏడాది మాత్రం రియల్ వ్యాపారం పడిపోవడం, ఎన్నికల కోడ్‌లు తదితర కారణాలతో కేవలం 13,513డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు జరిగి రూ.92.75 కోట్ల ఆదాయం మాత్రమే వచ్చింది. అంటే ఏకంగా రూ.8కోట్ల ఆదాయం తగ్గింది. జిల్లాలోని ఖమ్మంరూరల్, కూసుమంచి, వైరా సబ్



ఖమ్మం రిజిస్ట్రేషన్ కార్యాలయం

రిజిస్ట్రార్ కార్యాలయాల్లో డాక్యుమెంట్లు ఎక్కువగా జరుగుతుంటాయి. ఈసారి మాత్రం డాక్యుమెంట్ల సంఖ్య తగ్గి ఆదాయం ఆశించినంత రాలేదు. కూసుమంచి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో గతేడాది 5,242 డాక్యుమెంట్లు జరిగి రూ.14.64కోట్ల ఆదాయం రాగా, ఈఏడాది 6,067డాక్యుమెంట్లు జరిగినప్పటికి కేవలం రూ.13.13కోట్లు ఆదాయం వచ్చింది. రిజిస్ట్రేష్ల సంఖ్య పెరిగినా ఆదాయం మాత్రం కోటి రూపాయల పైగా తగ్గింది. అలాగే ఖమ్మం రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో గతేడాది 6,558 డాక్యుమెట్లు జరిగి రూ.25.84కోట్ల ఆదాయం రాగా ఈ ఏడాది 5001 డాక్యుమెంట్ల జరిగి రూ.21.75కోట్లు ఆదాయం వచ్చింది. ఈకార్యాలయంలో రూ.4కోట్లకు పైగా ఆదాయం తగ్గిపోయింది. కొత్తగూడెంలో గతేడాది రూ..34.64కోట్లు ఆదాయం రాగా ఈఏడాది రూ..27.30కోట్లు ఆదాయం వచ్చింది. ఈ కార్యాలయంలో రూ.7కోట్లపైగా ఆదాయం తగ్గింది. వైరా లో గతేడాది 4350 డాక్యుమెంట్లుకు రూ.12.12కోట్లు ఆదాయం రాగా ఈఏడాది 6067 డాక్యుమెంట్లు జరిగి రూ.13.57 కోట్లు ఆదాయం వచ్చింది. ఈ ఒక్క కార్యాలయంలో మాత్రమే రూ.కోటికి పైగా ఆదాయం పెరిగింది.

నవభారత్ ఎదుట వ్యక్తి వీరంగం

పాల్వంచ, మార్చి 30: నవభారత్ కర్మాగారంలోకి తనను అనుమతించాలంటూ ఓ వ్యక్తి ఆదివారం వీరంగం సృష్టించాడు. కర్మాగారంలోకి అనుమతించాలంటూ మద్యంమత్తులో ఉన్న ఓ వ్యక్తి సెక్యూరిటీ సిబ్బందిని కోరాడు. వారు అనుమతించకపోవడంతో తనతో తెచ్చుకున్న సీసాలోని పెట్రోల్‌ను వారిపై తనపై కూడా పెట్రోల్ చల్లుకుని బెదించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వచ్చేలోగా సదరు వ్యక్తి పారిపోయారు. సెక్యూరిటీ సూపర్‌వైజర్ రవి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ అడిషనల్ ఎస్ఐ రాఘవయ్య తెలిపారు.

విద్యుదాఘాతంలో ఒకరి దుర్మరణం

మధిర రూరల్, మార్చి 31: వి మధిర మున్సిపాలిటీ పరిధిలోని ఇల్లందులపాడులో ఆదివారం రాత్రి ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో మృతిచెండాడు. గ్రామానికి చెందిన బలవంతపు అనిల్(31) మరో ఇద్దరు స్నేహితులతో కలిసి ఇల్లందలపాడు నుంచి పొలాల వైపు రాత్రి 8 గంటల సమయంలో కుందేళ్ల వేటకు వెళ్లారు. ఆ పొలాల్లో ఉన్న విద్యుత్ వైర్లు తగిలి అనిల్ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. మరో యువకుడికి స్వల్ప గాయాలు అయ్యాయి.

బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించిన సింగరేణి

- 69.97 మి. టన్నుల బొగ్గు ఉత్పత్తికి 69.81 మి. టన్నుల ఉత్పత్తి

కొత్తగూడెం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఈ ఏడాది బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి చేరువలో ఉంది. ఆదివారం ఈ ఆర్థిక సంవత్సరానికి చివరి రోజు అయినప్పటికీ 100 శాతం బొగ్గు ఉత్పత్తి అనుకున్న లక్ష్యానికి సాధించిందని చెప్పవచ్చు. ఈ ఆర్థిక సంవత్సరంలో 69.97 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించే లక్ష్యంగా పెట్టుకుంది. అయితే శనివారం వరకు 69.81 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించినట్లైంది. అండర్‌గ్రౌండ్ బొగ్గుబావుల కంటే ఓపెన్‌కాస్టు గనుల్లోనే బొగ్గు ఉత్పత్తి అధికంగా జరిగిందని చెప్పవచ్చు. అండర్ గ్రౌండ్ బొగ్గుబావుల్లో 8.24 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకోగా 5.91 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి మాత్రమే జరిగింది. ఓపెన్‌కాస్టు గనుల్లో మాత్రం 61.73 మి లియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకోగా 63.89 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగింది. దీని బట్టి చూస్తే ఓపెన్‌కాస్టు గనుల్లోనే అనుకున్న బొగ్గు ఉత్పత్తి లక్ష్యం కంటే ఎక్కువగా ఉత్పత్తి అయిందని చెప్పవచ్చు. కొత్తగూడెం ఏరియాలో 106శాతం బొగ్గు ఉత్పత్తి జరిగింది. 1.29మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి 1.37 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగింది. ఇల్లెందు ఏరియాలో కూడా 109శాతం బొగ్గు ఉత్పత్తి జరిగింది. 3.97 మిలియన్ టన్నులకు గాను 4.35 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి వచ్చింది. మణుగూరు ఏరియాలో కూడా 106శాతం బొగ్గు ఉత్పత్తి జరిగిందని చెప్పవచ్చు. బెల్లంపల్లి ఏరియాలో 103 శాతం బొగ్గు ఉత్పత్తి జరిగింది. మందమర్రి ఏరియాలో 91శాతం మాత్రమే బొగ్గు ఉత్పత్తి జరిగింది. ఇక్కడ కొద్దిగా బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి చేరుకోలేదని చెప్పవచ్చు. శ్రీరాంపూర్ ఏరియాలో 89శాతం మాత్రమే బొగ్గు ఉత్పత్తి జరిగిందని చెప్పవచ్చు. రామగుండం -1 ఏరియాలో 102శాతం బొగ్గు ఉత్పత్తి జరగ్గా రామగుండం- 2 ఏరియాలో 102శాతం, రామగుండం -3 ఏరియాలో 107శాతం బొగ్గు ఉత్పత్తి జరిగింది.

ఎన్టీపీసీ 'రెండో దశ'తో ఒప్పందానికి నో!

2400 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణం.. కరెంటు కొనుగోలుకు సర్కారు విముఖత

- విద్యుత్తు వచ్చేది 5-8 ఏళ్ల తర్వాతే!
- అప్పటికి రూ.8-9 మధ్య యూనిట్ ధర
- ఒప్పందం చేసుకుంటే రాష్ట్రానికి గుదిబండే!



హైదరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రామగుండంలో ఎన్టీపీసీ ఆధ్వర్యంలో నిర్మించతలపెట్టిన రెండో విడత తెలంగాణ సూపర్ థర్మల్ విద్యుత్తు కేంద్రం నుంచి కరెంటు కొనుగోలు చేస్తే రాష్ట్రానికి పెనుభారంగా మారే ప్రమాదం ఉందని ప్రభుత్వం అంచనా వేసింది. 2400 మెగావాట్ల సామర్థ్యంతో తలపెట్టిన ఈ విద్యుత్కేంద్రం నిర్మాణానికి ఐదు నుంచి ఎనిమిదేళ్లు పడుతుందని.. అప్పటికి ఇక్కడి నుంచి ఉత్పత్తయ్యే విద్యుత్తు ధర యూనిట్‌కు రూ.8-9కి ఎగబాకుతుందని రాష్ట్ర ఇంధన శాఖ అంచనాకు వచ్చింది. బహిరంగ మార్కెట్లో ఇంతకంటే తక్కువ ధరకే విద్యుత్తు లభిస్తుండగా, భారీ ధరతో 25 ఏళ్ల పాటు కరెంటు కొనుగోలుకు దీర్ఘకాలిక ఒప్పందం చేసుకుంటే రాష్ట్ర ప్రజలపై రూ.వేల కోట్ల అనవసర భారం పడుతుందని తేల్చింది. ఈ నేపథ్యంలో ఎన్టీపీసీతో ఎలాంటి విద్యుత్తు కొనుగోలు ఒప్పందం చేసుకోరాదని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది. త్వరగా ఒప్పందం చేసుకోకపోతే ఇతర రాష్ట్రాలతో అగ్రిమెంట్ చేసుకుని విద్యుత్కేంద్రం నిర్మిస్తామని ఎన్టీపీసీ ఇటీవల అల్టిమేటం జారీ చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ వ్యవహారంపై సమీక్షించి, కొనుగోలు ఒప్పందం చేసుకోరాదని నిర్ణయించింది. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణలో విద్యుత్తు కొరతను తీర్చడానికి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో 4000 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని పునర్విభజన చట్టం-2014లో కేంద్రం హామీ ఇవ్వగా, తొలి విడత కింద 1600 మెగావాట్ల విద్యుత్కేంద్రం నిర్మాణాన్ని ఇటీవల ఎన్టీపీసీ పూర్తి చేసింది. రెండో విడత కింద 2400 మెగావాట్ల ప్లాంట్లను నిర్మించాల్సి ఉంది. తొలి విడత విద్యుత్తు ధర యూనిట్‌కు రూ.5.90 ఉండగా, ఒప్పందం కారణంగా కొనుగోలు చేయక తప్పని పరిస్థితి ఉంది.

గత సర్కారు తప్పిదమే..!

పదేళ్లలో గత ప్రభుత్వం చేసిన పాపాలు రాష్ట్రంలో విద్యుత్తు సంస్థలకు గుదిబండగా మారాయని కాంగ్రెస్ సర్కారు ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. రెండో విడతలో 2400 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణానికి ఎన్టీపీసీతో ఒప్పందం చేసుకోకుండా 10 ఏళ్లపాటు జాప్యం చేయడమే దీనికి కారణమని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అప్పట్లో ఒప్పందం చేసుకొని ఉంటే ఇప్పటికే నిర్మాణం పూర్తయి, తక్కువ ధరకు రాష్ట్రానికి కరెంటు వచ్చేదని చెబుతున్నాయి. ఇప్పుడు ఒప్పందం చేసుకుంటే భవిష్యత్తులో రాష్ట్రానికి గుదిబండగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

కొత్త థర్మల్ ప్లాంట్లకు స్వస్తి..

దామరచర్లలో తెలంగాణ జెన్‌కో నిర్మిస్తున్న 4000 మెగావాట్ల యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రం నాలుగేళ్ల కిందే పూర్తి కావాల్సి ఉండగా, ఇంకా పనులు సాగుతున్నాయి. జాప్యంతో ప్రాజెక్టు నిర్మాణ వ్యయం పెరిగింది. కాలం చెల్లిన సబ్‌క్రిటికల్ టెక్నాలజీతో నిర్మించిన భద్రాద్రి విద్యుత్తు కేంద్రం వ్యయం సైతం భారీగా పెరగడంతో దాని విద్యుత్తు ధరలూ పెరిగిపోయాయి. యాదాద్రి, భద్రాద్రి ప్లాంట్ల నిర్మాణంలో తీవ్ర అవినీతి ఆరోపణలు రావడంతో కాంగ్రెస్ సర్కారు న్యాయ విచారణకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో మళ్లీ కొత్త థర్మల్ విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణం జోలికి వెళ్లవద్దని ప్రభుత్వం ఓ అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. ప్రత్యామ్నాయంగా మార్కెట్‌లో రూ.2-4కు యూనిట్ చొప్పున లభిస్తున్న పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని పెంచుకోవాలని నిర్ణయించింది. సౌర, జల, పవన, పంప్డ్ స్టోరేజీ, బ్యాటరీ స్టోరేజ్ విద్యుత్తుపై దృష్టిపెట్టాలని నిర్ణయించింది.

బాసర ఆలయంలో విజిలెన్స్ తనిఖీలు

(మొదటిపేజీ తరువాయి)

సెంట్రల్ స్టోర్‌లో ఉన్న సరుకులను పరిశీలించారు. సరుకుల నాణ్యత, బ్రాండ్‌లు రికార్డుల్లో పేర్కొన్న ప్రకారం ఉన్నాయో లేదో సరి చూశారు. టెండరులో ఉన్న బ్రాండ్‌లు, క్వాలిటీ కాకుండా ఇతర సరుకులు ఉన్నట్లు, రికార్డుల్లో ఉన్న సరుకులకు, స్టోర్ రూమ్‌లో ఉన్న సరుకుల లెక్కలకు తేడాలు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం ఆలయ కార్యాలయంలో దాదాపు 5 గంటల పాటు రికార్డులను పరిశీలించారు. సరుకుల కొనుగోళ్లకు సంబంధించిన ప్రతీ బిల్లును తనిఖీ చేశారు. జాబితాలో దాదాపు 70 శాతానికి పైగా సరుకుల ధరలు మార్కెట్ రేటు కంటే ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. ఈ విషయంలో ఆలయ అధికారులపై విజిలెన్స్ అధికారి అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఎంఆర్‌పీ కూడా చూడకుండా టెండరును ఎలా నిర్ధారణ చేస్తారని అధికారులను ప్రశ్నించారు. విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా రావడంతో ఆలయ ఈవో హైదరాబాద్ నుంచి హుటాహుటిన బాసర వచ్చారు. కాగా, విజిలెన్స్ అధికారుల ఇచ్చే నివేదిక ఆధారంగా దేవాదాయ శాఖ చర్యలు తీసుకుంటుంది.

పంట నష్టం పరిహారమేదీ?

ఏడాదిగా ఎదురుచూస్తున్న రైతన్నలు.. గతేడాది మార్చి, ఏప్రిల్‌లో 1,51,545 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

- ఎకరాకు రూ.10 వేల పరిహారం ఇస్తామన్న గత ప్రభుత్వం
- నేటికీ అందని రెండో విడత పంట నష్టపరిహారం
- కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఇవ్వాలని రైతుల వేడుకోలు



జగిత్యాల జిల్లా మోరపల్లిలో నేలవాలిన మొక్కజొన్న (ఫైల్)

జనగామ/జగిత్యాల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలు ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలు అకాలవర్షానికి నేలపాలయ్యాయి. వడగళ్ల వానలు, ఈదురుగాలులు పంటలను అతలాకుతలం చేశాయి. రైతన్న వేదనను చూసిన ప్రభుత్వం.. వారికి పంట నష్టపరిహారం ఇచ్చి ఆదుకుంటామని హామీ ఇచ్చింది. నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.10 వేల చొప్పున ఇస్తామని చెప్పింది. కానీ, ఏడాది కాలం గడిచిపోతున్నా.. ఇప్పటికీ రైతులకు పరిహారం అందలేదు. ఇంకా వారికి ఎదురుచూపు తప్పలేదు. గతేడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో కురిసిన అకాల వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా అధిక విస్తీర్ణంలో వరి, మామిడి, మొక్కజొన్న తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కోత దశకు వచ్చిన పంట కావడంతో వడగళ్ల దెబ్బకు గింజలన్నీ నేలరాలి రైతులకు కడగళ్లను మిగిల్చాయి. అధికారుల ద్వారా పంట నష్టం వివరాలను తెప్పించుకున్న నాటి ప్రభుత్వం.. నష్టపోయిన రైతులందరికీ పరిహారం చెల్లిస్తామని చెప్పినా.. కేవలం మార్చి నెలకు సంబంధించిన పరిహారాన్ని మాత్రమే రైతుల ఖాతాల్లో జమ చేసింది. అయితే మార్చి నెలలో జరిగిన నష్టం కన్నా ఏప్రిల్‌లో రెట్టింపు నష్టం సంభవించింది. కానీ, ఏప్రిల్‌లో జరిగిన నష్టానికి సంబంధించిన పరిహారాన్ని మాత్రం రైతులకు నేటికీ ఇవ్వలేదు. ఇందుకోసం రూ.151.54 కోట్లు విడుదల చేస్తున్నట్లు ఆనాడు ప్రకటించినా రైతుల ఖాతాల్లో మాత్రం జమ కాలేదు.

రెండు లక్షల ఎకరాల్లో పంట నష్టం..

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.28 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందన్న విషయాన్ని నాడు ఖమ్మం జిల్లాలో పంటల పరిశీలన సందర్భంగా అప్పటి సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఇందులో మొక్కజొన్న 1,29,446 ఎకరాలు, వరి 72,709 ఎకరాలు, మామిడి 8,865 ఎకరాల్లో నష్టపోయిందని పేర్కొన్నారు. గతేడాది మార్చి 23న ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో కేసీఆర్ పర్యటించి నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా పంటనష్టం జరిగిన 26 జిల్లాల్లో వ్యవసాయాధికారులు సర్వే నిర్వహించి 1,51,545 ఎకరాల్లో నష్టం జరిగినట్లు తేల్చారు. దీనికి సంబంధించి ఎకరానికి రూ.10 వేల చొప్పున రూ.151.54 కోట్లు విడుదల చేస్తున్నట్లు గతేడాది జూన్‌లో కేసీఆర్ సర్కారు ప్రకటించింది. మొత్తం 1,30,988 మంది రైతులు పరిహారానికి అర్హులుగా పేర్కొంది. అయితే మార్చి నెల పరిహారాన్ని మాత్రమే రైతుల ఖాతాల్లో జమ చేసింది. కాగా, జగిత్యాల జిల్లాలో గతేడాది మార్చి, ఏప్రిల్‌తోపాటు జూలైనూ కలిపి 73,686 ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో మార్చిలోనే 6,199 ఎకరాల్లో పంటలు దెబ్బతినగా.. కేవలం 532 ఎకరాలకే పరిహారం చెల్లించారు. ఏప్రిల్‌లో 52 వేల ఎకరాల్లో, జూలైలో భారీ వర్షాలకు 15,487 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లగా.. ఇప్పటివరకు పరిహారం ఇవ్వలేదు. మొత్తంగా రెండో విడతకు సంబంధించి 20,160 మంది రైతులకు పరిహారం కింద రూ.36.69 కోట్లు చెల్లించాల్సి ఉంది.

ఆర్థిక శాఖలో పెండింగ్..

రెండో విడత పంట నష్టం పరిహారానికి సంబంధించిన నిధులు ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో 2 విడతలకు సంబంధించి రూ.151.54 కోట్లు విడుదల చేయగా వాటికి ఫైనాన్స్ క్లియరెన్స్ లభించలేదని అధికారులు చెబుతున్నారు. క్లియరెన్స్ వస్తే నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యే అవకాశముంది. దీనిపై కొత్త ప్రభుత్వం దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

ఏడు ఎకరాల్లో పంట నష్టపోయాను



గతేడాది యాసంగిలో ఏడెకరాల్లో వరి పంట సాగు చేస్తే వడగళ్లు, ఈదురుగాలుల కారణంగా పంటంతా నాశనమైంది. చేతికొచ్చిన గింజలన్నీ చేలోనే రాలిపోయి ఏమీ చేతికిరాలేదు. పంట సాగుకు పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు. అధికారులు సర్వే చేసి పంట నష్ట పరిహారం అందిస్తామని చెప్పారు. కానీ, ఏడాది దాటుతున్నా ఒక్క పైసా పరిహారం రాలేదు. అధికారులను అడిగితే ప్రభుత్వం వద్దే పైసలు ఆగిపోయాయని చెబుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పరిహారాన్ని అందించాలి. - గొడ్డేటి రాజు, గానుగుపహాడ్, జనగామ జిల్లా

రేపు తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనం రద్దు

తిరుమల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో మంగళవారం శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ నెల తొమ్మిదో తేదీన ఉగాది ఆస్థానం సందర్భంగా మంగళవారం శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం (ఆలయ శుద్ధి) నిర్వహించనున్నారు. ఉదయం 6 నుంచి 11 గంటల వరకు ఈ కార్యక్రమం జరగనుండటంతో వీఐపీ బ్రేక్‌ను టీటీడీ రద్దు చేసింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఇప్పటికే ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను రద్దు చేసిన విషయం తెలిసిందే. ప్రొటోకాల్ పరిధిలో స్వయంగా వచ్చే వీఐపీలకు, ట్రస్టు దాతలకు మాత్రమే బ్రేక్ దర్శన టికెట్లను జారీ చేస్తున్నారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నేపథ్యంలో వీటిని కూడా రద్దు చేస్తున్నట్టు టీటీడీ తెలిపింది. కాగా, ఎన్నికల కోడ్ నేపథ్యంలో తిరుమల శ్రీవారి శ్రీవాణి ట్రస్టుకు గడిచిన 15 రోజుల్లో రూ.22.75 కోట్ల విరాళాలు అందాయి. ఎన్నికల కోడ్ కారణంగా మార్చి 16వ తేదీ నుంచి వీఐపీ బ్రేక్ సిఫారసు లేఖలను టీటీడీ రద్దు చేసింది. ఈ క్రమంలో శ్రీవాణి ట్రస్టుకు రూ.10వేల విరాళం అందించి రూ.500 బ్రేక్ దర్శన టికెట్లను కొనుగోలు చేసే వారి సంఖ్య పెరిగింది.

బెంగాల్‌లో తుఫాను బీభత్సం

- నలుగురి మృతి, 200 మందికి గాయాలు

కలకత్తా, మార్చి 31: పశ్చిమ బెంగాల్‌లోని జల్పాయిగురి జిల్లాలో ఈదురుగాలులతో కూడిన భారీ తుఫాను కారణంగా పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి. చెట్లు, హోర్డింగులు, కరెంటు స్తంభాలు నేల కూలాయి. పలు వాహనాలు తిరగబడ్డాయి. దాంతో నలుగురు మృతి చెందగా, 200 మందికిపైగా గాయపడ్డారు. మృతి చెందిన వారికి పశ్చిమ బెంగాల్ సీఎం మమత సానుభూతి తెలిపారు. వారి కుటుంబసభ్యులకు తగిన పరిహారం అందజేస్తామని ప్రకటించారు. గాయపడిన వారికి ప్రభుత్వమే చికిత్స అందిస్తుందని హామీ ఇచ్చారు. కల్లోలిత ప్రాంతాల్లో తగిన రక్షణ చర్యలు చేపట్టవలసిందిగా అధికారులను ఆదేశించారు. బెంగాల్ వరదల్లో మరణించిన వారికి ప్రధాని మోదీ సానుభూతి ప్రకటించారు.

'తలసీమియా'ను జయించాడు..

- హెచ్‌ఎల్‌ఏ హాఫ్ మ్యాచ్‌తో షణ్ముక్‌కు బోన్‌మ్యారో చికిత్స
- చిన్నారికి స్వాగతం పలికిన సంకల్ప సంస్థ



తలసీమియాను జయించిన బాలుడితో వైద్యులు, సంకల్ప సేవాసంస్థ సభ్యులు

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 31: తలసీమియా వ్యాధి నివారణకు చేసే బోన్ మ్యారో చికిత్స తొలిసారి హాఫ్ మ్యాచ్ హెచ్‌ఎల్‌ఏతో చేయించుకొని విజయం సాధించాడో చిన్నారి. చికిత్స చేయించుకున్న చిన్నారి షణ్ముక్ పూర్తి ఆరోగ్యంగా ఉన్నాడు. మణుగూరుకు చెందిన చిన్నారి కె.షణ్ముక్ 9 సంవత్సరాలుగా తలసీమియాతో బాధపడుతున్నాడు. ఈనేపథ్యంలో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా బెంగుళూరులో అతి ఖరీదైన బోన్‌మ్యారో వైద్యం అతి తక్కువ ఖర్చుతో చేయించుకుని, విజయవంతం కావడంతో పూర్తి ఆరోగ్యంతో ఆదివారం తిరిగి ఖమ్మం చేరుకున్నాడు. చిన్నారికి సంస్థ బాధ్యులు, వైద్యులు ఘనస్వాగతం పలికారు. రితన్య ఆసుపత్రిలోని తలసీమియా డేకేర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో రవిచందర్, వైద్యులు డి.నారాయణమూర్తి మాట్లాడుతూ ఎంతో ఖర్చుతో కూడిన వైద్య చికిత్సగా పేరున్న బోన్‌మ్యారో చికిత్స చేయించుకున్న చిన్నారికి అభినందనలు తెలిపారు. హెచ్‌ఎల్‌ఏ 10/10 మ్యాచ్ అయినా చికిత్స సక్సెస్ రేటు చాలా తక్కువ అని అన్నారు. రాష్ట్రంలో హెచ్‌ఎల్‌ఏ 5/10 మ్యాచ్‌తో బోన్ మ్యారో చికిత్స చేయించుకొని విజయవంతం అయిన తొలి చిన్నారి షణ్ముక్ అన్నారు. ఈ చికిత్స విజయవంతం అయితే చిన్నారులకు ప్రతి 20 రోజులకు రక్తం ఎక్కించుకునే అవసరం లేకుండా పోతుందన్నారు. చికిత్స చేయించుకుని నాలుగు నెలల తర్వాత తిరిగి సొంత ప్రాంతానికి వచ్చిన చిన్నారి ఆరోగ్యం పట్ల మరో 10 నెలలు జాగ్రత్తగా ఉండాలన్నారు. బోన్‌మ్యారో వైద్యచికిత్సను బెంగుళూరు సంకల్ప్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో అతి తక్కువ ఖర్చుకు చేయించినట్లు తెలిపారు. చిన్నారికి వైద్య ఖర్చులు, ఇతర అవసరాలకు తమ సంస్థతో కలిసి మరి కొంత మంది దాతలు ముందుకు వచ్చి అందించారని, అందరి సహకారంతో తలసీమియా నుంచి మరో చిన్నారిని విముక్తి చేయగలిగామని సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి పి రవిచందర్ పేర్కొన్నారు. చిన్నారికి స్వాగతం పలికిన వారిలో సంస్థ ఉపాధ్యక్షులు పి.పావని, పి.ఉదయ్ భాస్కర్, పి.అనిత, ఎస్.ఉపేందర్, కృష్ణ తదితరులు ఉన్నారు.

పులిగుట్టను సందర్శించిన అడిషనల్ డీసీపీ



ఆలయంలో అడిషనల్ డీసీపీ

వైరా, మార్చి 31: మండలంలోని గొల్లపూడి సమీపంలో ఉన్న శ్రీపులిగొండ లక్ష్మీనర్సింహస్వామి ఆలయాన్ని ఖమ్మం అడిషనల్ డీసీపీ నరేష్‌కుమార్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు రవికుమార్, భక్తబృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శేష వస్త్రం, చిత్రపటంతో సత్కరించారు. వైరా ఎస్ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్, ప్రధానోపాధ్యాయులు చావా శ్రీనివాసరావు, జీవీ.సూర్యం, గ్రామానికి చెందిన పసుపులేటి సీతారాములు, మిట్టపల్లి సతీష్, షేక్.సైదా, ఆలయ సిబ్బంది దిరిశాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జగన్ నిర్వాకంతో ఏపీ ఖజానా ఖాళీ

అప్పు తీసుకోకపోతే పూటైనా గడవదు... పింఛన్లు ఇవ్వడానికి డబ్బు లేక టీడీపీపై నెపం మోపే యత్నం: చంద్రబాబు

- మార్కాపురం, ఎమ్మిగనూరు, బాపట్లల్లో భారీ బహిరంగ సభలు



బాపట్ల/కర్నూలు/ఒంగోలు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ నిర్వాకంతో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయి ఖజానా ఖాళీ అయిందని టీడీపీ అధినేత చంద్రబాబు విమర్శించారు. అప్పు తీసుకోకపోతే పూటగడవని స్థితికి ప్రభుత్వం చేరుకుందన్నారు. ప్రస్తుతం పింఛన్లు ఇవ్వడానికి కూడా డబ్బు లేక.. ఆ నెపం టీడీపీపై మోపే ప్రయత్నం చేస్తున్నాడని ధ్వజమెత్తారు. ప్రజాగళం యాత్రలో భాగంగా ఆదివారం ఆయన ప్రకాశం జిల్లా మార్కాపురం, కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు, బాపట్ల జిల్లా కేంద్రంలో జరిగిన భారీ బహిరంగ సభల్లో ప్రసంగించారు. జగన్ ఈ ఐదేళ్లలో రూ.13 లక్షల కోట్ల అప్పు చేశాడని, వాటిని ఆయన రోత పత్రిక తీరుస్తుందా.. భారతీ సిమెంట్స్ తీరుస్తుందా అని నిలదీశారు. ఈ సీఎం నమ్మించి గొంతు కోసే రకమని దుయ్యబట్టారు. రాయలసీమ బిడ్డనని చెప్పుకొంటూ ఈ ప్రాంతానికి ఏమీ చేయలేదన్నారు. ఈ ప్రాంతంలో 52 అసెంబ్లీ స్థానాలుంటే గత ఎన్నికల్లో 49 మంది వైసీపీ ఎమ్మెల్యేలను గెలిపించారని.. కానీ ఒక్క పనైనా చేశాడా అని ప్రశ్నించారు. ఐదేళ్లలో ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్టయినా పూర్తి చేశాడా.. కర్నూలు ప్రాంతానికి కనీసం నీళ్లు ఇవ్వాలన్న ఆలోచనైనా చేశాడా.. పేదలు, యువత భవిష్యత్ గురించి ఆలోచించాడా అని నిలదీశారు. ఆయన రాయలసీమ ద్రోహి అని.. ఒక్క ఓటు వేసినా మన నెత్తిన మనమే చెత్తవేసుకున్నట్లు అవుతుందని హెచ్చరించారు. బటన్ నొక్కి ప్రజల సంక్షేమమని ప్రతిరోజూ చెబుతున్నాడని.. అలాగైతే మద్య నిషేధం, జాబ్ కేలెండర్, డీఎస్సీలపై ఎందుకు నొక్కలేదని ప్రశ్నించారు. తొమ్మిదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచాడని.. ఆర్టీసీ, పెట్రోలు, డీజిల్, నిత్యావసరాల ధరలు పెరిగి జనం అల్లాడుతుంటే.. వాటిని తగ్గించే బటన్ ఎందుకు నొక్కలేదన్నారు. 'సంక్షేమం పేరుతో రూ.10 ఇచ్చి రూ.100 లాగేసుకుంటున్నాడు. బటన్ నొక్కి ఇచ్చింది ఎంత? ప్రజల నుంచి నొక్కింది ఎంత? అందులో మీరు బొక్కింది ఎంత' అని నిలదీశారు. రాష్ట్ర విభజన సమయంలో ఏపీ కన్నా తెలంగాణలో తలసరి ఆదాయం 35 శాతం అధికంగా ఉంటే 2014-19లో దానిని 27 శాతానికి తగ్గేలా చేశామని.. జగన్ వచ్చాక తేడా 45 శాతానికి పెరిగిందని.. బటన్ నొక్కి పేదల సంక్షేమం చేస్తే ఇంత వ్యత్యాసం ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. ఐదేళ్లుగా రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న శని మే 13తో విరగడైపోతుందని చెప్పారు.

ఫ్యాన్ చెత్తబుట్టలోకే..

ఈ ఎన్నికల్లో ఫ్యాన్ ముక్కలై చెత్తబుట్టలో పడేయడం ఖాయమని చంద్రబాబు అన్నారు. "ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని, విధ్వంసకర వైసీపీ పాలన అంతం కావాలన్న ఉద్దేశంతో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి పొత్తుకు ఆద్యుడు పవన్. మూడు పార్టీలు కలవడం మాకోసం, మా రాజకీయాల కోసం కాదు. ప్రజలు గెలవాలి, ఏపీ బాగుండాలన్న ఉద్దేశంతోనే! ఈ విషయాన్ని ప్రజలంతా గుర్తించాలి. సంక్షేమంతో పాటు అభివృద్ధి చేయాలంటే కేంద్రం సహకారం అవసరం. రాష్ట్ర ప్రయోజనాల కోసమే పొత్తు పెట్టుకున్నాం. మేం కలిస్తే జగన్ ఎందుకు కంగారు పడుతున్నాడు? ముస్లింలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాడు. ఎన్డీయే అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లు పోతాయని రెచ్చగొడుతున్నారు" అని మండిపడ్డారు.

దూలంచెక్క పడి బాలుడు మృతి

మణుగూరుటౌన్, మార్చి 31: ఇంటికోసం దూలాలను చెక్కుతున్న ఓ వ్యక్తి అక్కడే ఆడుకుంటున్న పిల్లలను పట్టించుకోకపోవడంతో ఒక దూలం మీదపడి ఓ బాలుడు మృతి చెందిన ఘటన ఆదివారం మణుగూరు మండలంలో జరిగింది. మండలంలోని మారు మూల ఆదివాసీ గ్రామమైన ఖమ్మంతోగులో సాయిహర్ష(7)అనే బాలుడు ఉదయం 10 గంటల సమయంలో గ్రామంలో ఓ మామిడి చెట్టు కింద ఆడుకుంటున్నాడు. అదే సమయంలో అక్కడ సాయిహర్ష పెద్దనాన్న నాగేశ్వరరావు ఇంటి నిర్మాణం కోసం దూలాలను చెక్కి ఓ పక్కగా పడేస్తున్నాడు. అయితే అక్కడే ఆడుకుంటున్న సాయిహర్ష నాగేశ్వరరావు దూలాలు పడేస్తున్న చోటుకు వచ్చాడు. కానీ అది గమనించకుండా నాగేశ్వరరావు చెక్కిన ఒక దూలం చెక్కను పక్కకు పడేయగా అది సాయిహర్షపై పడింది. తీవ్రంగా గాయపడ్డ సాయిహర్షను మణుగూరులోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే సాయి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సాయిహర్ష తండ్రి చంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టరు-ద్విచక్రవాహనం ఢీ.. ఒకరి మృతి

నేలకొండపల్లి, మార్చి31: మండల పరిధిలోని గువ్వలగూడెం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల ప్రకారం ముదిగొండ మండలం మేడేపల్లికి చెందిన బొంత వీరబాబు, బొంత ఎల్లయ్య(60) ఆదివారం ఉదయం ద్విచక్రవాహనంపై నేలకొండపల్లి వెళ్తున్నారు. ఖమ్మం వైపు నుంచి నేలకొండపల్లి వైపు వెళ్తున్న ట్రాక్టరును గువ్వలగూడెం వద్ద ద్విచక్రవాహనం ఓవర్‌టేక్ చేయబోయి ట్రాక్టరు ట్రక్కుకు తగిలి కిందపడినట్లు తెలుస్తున్నది. దీంతో ద్విచక్రవాహనం నడుపుతున్న వీరబాబు రోడ్డు పక్కకు పడిపోగా, ఎల్లయ్య రోడ్డుపై పడటంతో ట్రాక్టరు ట్రక్కు టైరు ఎల్లయ్యపై నుంచి వెళ్లటంతో ఎల్లయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. వీరబాబుకు తీవ్ర గాయాలైనాయి. గాయపడిన వీరబాబును చికిత్స కోసం నేలకొండపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నేలకొండపల్లి సీహెచ్‌సీకి తరలించారు. మృతునికి ఓ కుమార్తె ఉంది. మృతుని కుమార్తె ఫిర్యాదు మేరకు నేలకొండపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ములకలపల్లి, మార్చి 31: విద్యుద్ ఘాతంతో ములకలపల్లి మండలానికి చెందిన ఓ యువకుడు మృతిచెందాడు. ములకలపల్లి మండలం కొత్తగంగారం శివారు అల్లిగుంపు గ్రామానికి చెందిన పెనుబల్లి సాగర్ (19) విద్యుత్ స్తంభాలలో వైరింగ్ పనుల నిమిత్తం కడప జిల్లా పులివెందుల వెళ్లాడు. ఆదివారం అక్కడ విధి నిర్వహణలో ఉండగా విద్యుత్ ఘాతానికి గురై మరణించాడు. కాగా జగన్నాధపురానికి చెందిన ఈసం లక్ష్మణ్ తీవ్ర గాయాల పాలై చికిత్స పొందుతున్నాడు.

మంత్రి పొన్నాన్ని కలిసిన బోయినపల్లి



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కృష్ణమూర్తి

వైరా, మార్చి 31: రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఏపీఐఐసీ మాజీ డైరెక్టర్ బోయినపల్లి కృష్ణమూర్తి ఆదివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరిన బోయినపల్లి మంత్రి పొన్నంను కలిసి సన్మానించారు. వైరా ప్రాంతంలో కాంగ్రెస్ కార్యకలాపాల్లో తాను కూడా చురుగ్గా పాల్గొని లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి కృషిచేస్తానని మంత్రి పొన్నంకు బోయినపల్లి స్పష్టం చేశారు.

ఖమ్మం గడ్డపై నీలి జెండా ఎగురవేస్తాం: బీఎస్పీ

ఖమ్మం సాంస్కృతికం మార్చి 31: త్వరలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం గడ్డపై నీలి జెండా ఎగురవేస్తామని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం ఖమ్మం లోని పార్టీ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుర్ర ఉపేంద్ర సాహు అధ్యక్షతన జరిగిన ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గస్థాయి సన్నాహక సమావేశంలో ముఖ్య అతిథిగా మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ తిరిగి అధికారం లోకి వస్తే రాజ్యాంగం మార్చే ప్రమాదం ఉందని బహుజన సమాజానికి ఇవే చివరి ఎన్నికలు అయ్యే అవకాశం ఉందన్నారు. ముంతాపురం బాలయ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రా కామేష్, జిల్లా ఇంచార్జ్‌లు మేకతోట పుల్లయ్య, కర్రి కృష్ణ చెరుకుపల్లి నాగేశ్వరరావు, నాగరాజు పాల్గొన్నారు.

కూటమి విజయం ఖాయం: పవన్

- వైసీపీ దోపిడీని అరికడితే అన్ని పథకాలకు నిధులు వస్తాయి
- పింఛన్లు అందేలా చూడండి.. 3 పార్టీల నేతలకు జనసేనాని పిలుపు




పిఠాపురం, మార్చి 31: రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి రాబోయేది జనసేన-టీడీపీ-బీజేపీ కూటమి ప్రభుత్వమేనని జనసేన అధినేత పవన్ కల్యాణ్ పునరుద్ఘాటించారు. భారీ మెజారిటీతో సీట్లు గెలవబోతున్నామని తెలిపారు. ప్రస్తుతం అమలు చేస్తున్న ఏ సంక్షేమ పథకం ఆగిపోదని.. ఈ విషయాన్ని స్పష్టంగా అందరికీ తెలియజేయాలని మూడు పార్టీల నేతలకు పిలుపిచ్చారు. ఆదివారం కాకినాడ జిల్లా పిఠాపురం మండలం కుమారపురం గోకులం గ్రాండ్‌లో ఆదివారం పిఠాపురం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం, ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసి సైబరాబాద్ వంటి ప్రత్యేక నగరాన్ని తయారు చేసిన అనువజ్ఞుడు, టీడీపీ అధినేత చంద్రబాబును జగన్ ప్రభుత్వం అకారణంగా, కక్షపూరితంగా జైలులో పెట్టినప్పుడు బాధేసిందని జనసేనాని పవన్ కల్యాణ్ అన్నారు. రాజమహేంద్రవరం వెళ్తున్నప్పుడు దారిపొడవునా టీడీపీ కార్యకర్తలు తమ నాయకుడి కోసం పడిన తపన తనను కదిలించిందని, అందుకే సెంట్రల్ జైలులో చంద్రబాబును కలిశాక తన వంతుగా ఏదైనా చేయాలని భావించి కచ్చితంగా వచ్చే ఎన్నికల్లో రెండు పార్టీలు కలిసి వెళ్తాయని ప్రకటించానని ఆయన తెలిపారు. అప్పుడు తాను చెప్పినట్లుగానే బీజేపీ తమతో కలిసి వచ్చిందని చెప్పారు. ఆ పార్టీ కోసం ఎంపీ సీట్లు తగ్గించుకున్నానని తెలిపారు. తాను పొత్తు కోసం ఎంత తపించానో.. మూడు పార్టీల నాయకులు గెలుపు కోసం అంతే కష్టపడాలని సూచించారు. చిన్న చిన్న ఇబ్బందులు ఉన్నా వాటిని అధిగమించి పనిచేయాలని కోరారు. 'ఇప్పుడు ఇస్తున్న పథకాల కంటే అధికంగానే సంక్షేమ ఫలాలు పంచుతాం. మద్యం, గంజాయి, ఇసుక, ల్యాండ్ మాఫియా వంటి వాటిని అరికడితే అన్ని పథకాలకు కచ్చితంగా డబ్బులు సర్దుబాటవుతాయి. వైసీపీ దోపిడీ అరికడితే అప్పులు చేయకుండానే సంక్షేమ పథకాలు అమలు చేయవచ్చు. ఎన్నికల కోడ్ వల్ల ప్రతినెలా ఒకటో తేదీన అందాల్సిన సామాజిక పింఛన్లు ఈ నెల ఆలస్యం కావచ్చు. వలంటీర్లు లేకుండా పింఛన్లు సక్రమంగా పంపిణీ చేసేందుకు మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎన్నికల నియామావళికి అనుగుణంగా అధికారులకు సహకరించాలి' అని సూచించారు.

ఉత్తరాదిపై మజ్లిస్ గురి!

- యూపీ, బిహార్‌లో ఖరారైన పొత్తులు
- వ్యూహాత్మకంగా హిందువులకూ టికెట్లు

హైదరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు హైదరాబాద్ పాతనగరంలో.. ఎంసీహెచ్(ప్రస్తుతం జీహెచ్‌ఎంసీ) ఎన్నికల్లో పత్తర్‌గట్టీ డివిజన్ నుంచి విజయభేరీ మోగించిన మజ్లిస్ ఇత్తేహాదుల్ ముస్లిమీన్(ఎంఐఎం) క్రమంగా జాతీయ పార్టీగా ఎదుగుతోంది. ఈ క్రమంలో బిహార్, యూపీల్లో ఓటుబ్యాంకును.. ఓట్ల శాతాన్ని పెంచుకుంటూ ముందుకు పోతోంది. ఈ క్రమంలో ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో తమకు సిటింగ్ స్థానం ఉన్న మహారాష్ట్రతో పాటు.. యూపీ, బిహార్‌పై ప్రత్యేకంగా దృష్టిసారించింది. "మేము బీజేపీకి వ్యతిరేకం. అలాగని కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమికి మద్దతు కాదు. ఇండియా కూటమి కేవలం ఎన్నికల అవసరాలకే పరిమితం. మైనారిటీ, బడుగు వర్గాల అభ్యున్నతికి మేం పనిచేస్తాం" అని మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ స్పష్టం చేశారు. యూపీలో డాక్టర్ పల్లవి పటేల్ నాయకత్వంలోని అప్నాదళ్(కామెరవాడి)తో కలిసి పోటీ చేస్తామని ఆదివారం ఆయన ప్రకటించారు. ప్రగతిశీల మానవ్ సమాజ్ పార్టీ, రాష్ట్రీయ ఉదయ్ పార్టీతోనూ పొత్తు ఉంటుందని, బిహార్‌లోనూ ఎన్డీయే-ఇండియా కూటముల్లో లేని పార్టీలను కలుపుకొనిపోతున్నట్లు వివరించారు. ఉత్తరప్రదేశ్‌లో ఏడు, బిహార్‌లో 11 స్థానాల్లో పోటీ చేస్తున్నట్లు తెలిపారు. బిహార్‌లో ఐదు చోట్ల హిందువులకు మజ్లిస్ టికెట్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. మహారాష్ట్రలో గతంలో ఎంవీఏతో కలిసి పోటీ చేసిన మజ్లిస్.. ఈ సారి ఒంటరిగా వెళ్తోంది. తమ పార్టీ ఔరంగాబాద్ సిటింగ్ ఎంపీ ఇంతియాజ్ జలీల్ అదేస్థానంలో పోటీ చేయనుండగా.. మైనారిటీల బలం ఎక్కువగా ఉన్న మరో నాలుగు చోట్ల మజ్లిస్ బరిలోకి దిగనున్నట్లు తెలుస్తోంది. కర్ణాటకలో సమీకరణాలు అనుకూలంగా లేనందున పోటీ చేయడం లేదని మజ్లిస్ వర్గాలు తెలిపాయి.



స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాల ఆవిష్కరణ



ముదిగొండ, మార్చి31: ముదిగొండ గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు దివంగత రావులపాటి సత్యనారాయణ, హైమావతి దంపతుల విగ్రహాలను ఆదివారం ముదిగొండలో వారి కుమారుడు, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి రావులపాటి సీతారామారావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పాల్గొని వారి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సత్యనారాయణ, హైమావతి దంపతుల త్యాగాలు, సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో రావులపాటి శ్రీనివాస్, క్రిష్టప్ప, రాయల వెంకటేశ్వరరావు, స్వరాజ్ పాల్గొన్నారు.

దయాకర్‌రెడ్డి పర్యటన

ఖమ్మంరూరల్,మార్చి31: మండలంలోని గుదిమళ్ళ, చింతపల్లి, ఆరెకోడు తదితర గ్రామాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరి దయాకర్‌రెడ్డి ఆదివారం పర్యటించారు. ఆయాగ్రామాల్లోని పలుశుభకార్యాల్లో పాల్గొన్నారు. గుదిమళ్లలో జరిగిన లక్ష్మీ తిరుపతమ్మ జాతరలో పాల్గొని స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటరెడ్డి,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం విజయవంతం



ఖమ్మంరూరల్, మార్చి31: మండల పరిధిలోని గోళ్లపాడులో హైదరాబాద్‌కి చెందిన అవేర్ గ్రూపు, జిల్లా హోమియో డాక్టర్స్ అసోసియేషన్ సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరం విజయవంతమైంది. బీపీ, షుగర్, థైరాయిడ్, మొలలు, కీళ్లనొప్పులు, నడుంనొప్పి వంటి ఇతర దీర్ఘకాలిక వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. హోమియోపతి వైద్యం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు హరి రమేష్, ఎంపీఎల్ నరసింహరావు, రవికుమార్, స్వామి, దీపక్ వర్మ, సుందర్ కల్యాణ్, కృష్ణార్జునరావు, మోహన్, సోందుమియా, జానీ, గోవిందమ్మ, అవేర్ సిబ్బంది కోటిరెడ్డి, వీరాచారి, భారతి తదితరులు పాల్గొన్నారు.

కలిసొచ్చిన కాలం

- యాసంగిలో సత్తుపల్లి మండలంలో భారీగా వరి దిగుబడి
- క్వింటా రూ.2400వరకు పలికిన తెలంగాణ సోనారకం
- 5వేల ఎకరాలలో వరిధాన్యం విక్రయించిన రైతులు

సత్తుపల్లి,మార్చి31: ఈ ఏడాది యాసంగి వరి సాగుకు కాలం కలిసిరావటంతో సత్తుపల్లి మండల రైతుల పంట పండింది. ప్రధాన జలాశయాలలో సాగునీరు అందుబాటులో లేకపోవడంతో యాసంగి వరిసాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోయింది. ఈ క్రమంలో సత్తుపల్లి మండలంలో వరి సాగు చేసిన రైతులు ముందుగానే పంట చేతికి రావడంతో ధర ఆశాజనకంగా లభించింది. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకముందే పంట చేతికి రాగా ప్రయివేట్ వ్యాపారులు రంగంలోకి దిగి మండలంలో ధాన్యం కొనుగోలు చేశారు. సత్తుపల్లి మండలంలో వాతావరణం అనుకూలించడం, వరిసాగుకు నీటి సౌకర్యం పుష్కలంగా ఉండడంతో దిగుబడులు కూడా గణనీయంగా వచ్చాయి. ఈక్రమంలో 5వేల ఎకరాల్లో ధాన్యాన్ని విక్రయించారు. వరిసాగు విస్తీర్ణం తగ్గడంతో డిమాండ్ పెరిగి ధరకూడా రైతులు ఆశించిన మేర లభించింది.

సత్తుపల్లి నియోజకవర్గంలో సాగు ఇలా..

సత్తుపల్లి నియోజకవర్గంలో సత్తుపల్లి, వేంసూరు మండలాలలో అత్యధికంగా రైతులు యాసంగి వరిసాగు చేపట్టారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ ఆయకట్టు పరిధిలోని కల్లూరు, పెనుబల్లి, తల్లాడ మండలాల్లో ఈ సీజన్‌లో వరిసాగు విస్తీర్ణం పడిపోయింది. సత్తుపల్లి మండలంలో 15,371ఎకరాలు, వేంసూరు మండలంలో 14,429ఎకరాలలో వరిసాగు చేయగా కల్లూరు మండలంలో 2470, పెనుబల్లి 5272, తల్లాడ మండలంలో 1485ఎకరాల్లో మాత్రమే వరిసాగు చేశారు. గత డిసెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు సత్తుపల్లి మండలం బేతుపల్లి పెద్ద చెరువు సహా ఇతర చెరువులు కూడా నిండటంతో పాటు ఎన్టీఆర్ కాలువ ద్వారా వేంసూరు మండలానికి సాగునీరు పుష్కలంగా అందింది. ఈ రెండు మండలాల్లో సాగునీటి వనరుల నుంచి నీటి వసతి ఉండటంతో పాటు వాతావరణం అనుకూలించడంతో రైతులు ఎక్కువ మొత్తంలో వరి సాగు చేశారు.



విక్రయానికి సిద్ధంగా ఉన్న ధాన్యం

భారీగా దిగుబడులు

సత్తుపల్లి, వేంసూరు మండలాల్లో రైతులు ప్రధానంగా తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్15048) రకం వరి సాగు చేశారు. సత్తుపల్లి మండలంలో ఇప్పటికే 5వేల ఎకరాలలో వరికోతలు పూర్తి అయ్యాయి. ప్రయివేట్ వ్యాపారుల కూడా ఈరకం వరి ధాన్యానికి 76కిలోల బస్తాకు రూ.1800పైగా చెల్లించి కొనుగోలు చేశారు. ఈ లెక్కన క్వింటా రూ.2400వరకు ధర పలికింది. పచ్చి వడ్లను కళ్లాల్లోనే రైతులు అమ్మేసి సొమ్ము చేసుకున్నారు. దిగుబడి కూడా సగటున 25నుంచి 28క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. సత్తుపల్లి మండలం నుంచి 18వేల క్వింటాళ్ల తెలంగాణ సోనా ధాన్యం ప్రయివేట్ వ్యాపారులు కొనుగోలు చేసి ఎగుమతి చేసినట్లు అంచనా.

మరో వారంలో ఇతర వరి రకాల కోతలు

నియోజకవర్గంలో రైతులు సాగు చేస్తున్న సాధారణ రకం వరి మరో వారం రోజులలో కోతలకు రానుంది. ప్రభుత్వం నేటినుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించడంతో సత్తుపల్లి నియోజకవర్గంలో సోమవారం కొన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,203కాగా సాధారణ రకానికి రూ.2183గా నిర్ణయించింది. ప్రభుత్వ నిబంధనలు కఠినంగా ఉండటంతో కొనుగోలు కేంద్రాల కంటే ప్రయివేట్ వ్యాపారులకు విక్రయించడం పైనే రైతులు దృష్టి సారిస్తున్నారు. నిబంధనల ప్రకారం రైతులు పండించిన వరి ధాన్యం ప్రమాణాలకు అనుగుణంగా శుభ్రపరిచి ఎండగట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలి. రైతులు కిలో వరిధాన్యం నమూనా ముందుగా కొనుగోలు కేంద్రానికి తెచ్చి చూపి టోకెన్ పొంది టోకెన్ తేదీన ధాన్యం తరలించాలి. తేమశాతం ఖచ్చితంగా 17శాతం లోపు ఉండేట్లుగా చూసి ధాన్యం కొనుగోలు కేంద్రానికి తేవాలి. తేమ, ఇతర నాణ్యత ప్రమాణాలలో తేడా ఉంటే కొనుగోలు కేంద్రాల వద్ద ఏర్పాటుచేసిన ప్యాడీ క్లీనర్లు, విన్నోవింగ్ ఫ్యాన్ల సహాయంతో ధాన్యాన్ని శుభ్రపరచుకోవాలి. ఇన్ని నిబంధనల మధ్య రైతులు కొనుగోలు కేంద్రాల వైపు వచ్చేందుకు వెనుకాడుతున్నారు. మరోపక్క ప్రయివేట్ వ్యాపారులు రైతుల పొలాల వద్దకే వెళ్లి ఏ రకమైన నిబంధనలు లేకుండా పచ్చిగా ఉన్న ధాన్యాన్ని నేరుగా కొనుగోలు చేయడంతో రైతులు ప్రయివేట్ వ్యాపారుల వైపు మొగ్గు చూపుతున్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలని ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న కొండయ్య తదతరులు

మధిర, మార్చి 31: చెడు వ్యసనాలైన గంజాయి, డ్రగ్స్‌వాటికి బానిసలై భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దని సామాజిక సేవకులు లంకా కొండయ్య యువతకు అవగాహన కలిగించారు. ఆదివారం తన బృందంతో క్రీడామైదానాలు కలియదిరిగి... నో గంజాయి, నో డ్రగ్స్ అంటూ ప్రచారం చేశారు. యువకులను సమీకరించి వాటివల్ల కలిగే నష్టాలను వివరిస్తూ చైతన్యం కలిగించారు. మధిర టీవీఎం స్కూల్ ఆవరణలో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాలీబాల్, ఇతర క్రీడలు ఆడుతున్న యువకులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అందుబాటులోకి వచ్చిన సాంకేతికతను తమ వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకొనేందుకు వినియోగించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమాల్లో వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

కామేపల్లి, మార్చి31: మండల పరిధిలోని ముచ్చర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ ఫీడర్‌లోని బీఎన్ బంజర, రేపల్లెవాడ, టేకులపల్లిలో సోమవారం ఉదయం 7గంటల నుంచి 11గంటలకు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమత్తులు, చెట్లతొలగింపు కారణంగా విద్యుత్‌కోత ఉంటుందన్నారు.

యాసంగి ఆశలు ఆవిరి

- ముదిగొండ మండలంలో ఎండుతున్న పంటలు
- బావులను తీయిస్తూ రైతుల భగీరథ యత్నం







ఎండిపోయిన ముదిగొండ చెరువు, నీళ్ల లేక ఎండిపోయిన మొక్కజొన్న పంట, బావి తీయిస్తున్న దృశ్యం

ముదిగొండ, మార్చి 31: ఈ ఏడాది కనీసం కుటుంబం గడుపుకునేందుకు కొద్ది ఆశతో సాగుచేసిన యాసంగి పంటలు ఎండిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒక పక్క పంట సాగుకు సాగర్‌నీరు లేక, మరోపక్క చెరువులు, కుంటలు సైతం ఎండిపోయాయి. భూగర్భజలాలు ఇంకిపోవడంతో బావులు, బోర్లలో నీళ్ల అడుగంటాయి. దిక్కుతోచని స్థితిలో రైతులు తమ పంట పొలాలు ఎండిపోతున్నాయని ఆందోళన చెందుతున్నారు. వరి, మొక్కజొన్న, పెసర, మినుము, బొబ్బర పంటలు పూర్తిగా ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాసంగి పంటల సాగుకు సాగర్‌నీరు లేకపోవడంతో చెరువులు, బావులు, బోర్లపై ఆధారపడి రైతులు పంటలు సాగు చేశారు. గత ఏడాది యాసంగిలో ముదిగొండ మండలంలో 25768ఎకరాల్లో వివిధరకాల పంటలు సాగుచేయగా ఈ ఏడాది యాసంగిలో 15046ఎకరాల్లో మాత్రమే పంటలు సాగుచేశారు. మండలంలో పామాయిల్ సాగు పెరగడంతో దాని సాగుకు కూడా నీటి ఎద్దడి ఏర్పడింది. వాటిని కాపాడుకొనేందుకు కొందరు రైతులు అధిక వ్యయం వెచ్చించి బావులను తీయిస్తూ భగీరథ యత్నం చేస్తున్నారు. కొంతమంది రైతులు నీరు లేక వరిపొలాలు ఎండిపోవడంతో పశువులను మేపుతున్నారు. కొంతమేర పొలాలు నెర్రెలు బారి పంటలు ఎండిపోతున్నాయి. ఆరుగాలం కష్టపడి వరికి ఎకరాకు రూ.20వేలు, మొక్కజొన్నకు రూ.40వేల మేర పెట్టుబడులు పెట్టి సాగుచేసిన పంటలు కళ్లముందు ఎండిపోతుండటంతో రైతులకు దుఃఖం ఒక్కటే మిగిలింది. సాగునీరు లేక ఎండిపోతున్న పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

పామాయిల్ కోసం రూ.లక్షన్నర ఖర్చుతో బావి తీయిస్తున్నం

సామినేని హరిప్రసాద్, రైతు, మేడేపల్లి



20ఎకరాల్లో పామాయిల్‌ను సాగు చేశాను. గతంలో రెండు బావులు ఉన్నాయి. పూర్తిస్థాయిలో నీటిమట్టం అడుగంటిపోయింది. పామాయిల్ పంటను కాపాడుకొనేందుకు రూ. లక్షన్నర ఖర్చుతో 45అడుగుల లోతులో బావిని తీయిస్తున్నాను. నీళ్ల లేక పామాయిల్ పంట ఎండిపోయే ప్రమాదముంది. మండలంలో ఇతర పంటలూ కూడా ఎండిపోతున్నాయి. రైతులను ఆదుకోవాలి.

ముస్లింల ఏతేకాఫ్ దీక్ష ప్రారంభం



కల్లూరు మసీదులో ఏతేకాఫ్ దీక్ష చేపట్టిన ముస్లింలు

కల్లూరు, మార్చి31: రంజాన్ మాసంలో ముస్లీం భక్తులు చివరి పదిరోజులు అత్యంత పవిత్రంగా పాటించేంది ఏతేకాఫ్ దీక్ష.. కల్లూరులోని పలు మసీదులలో ఆదివారం అసర్ నమాజ్ ప్రార్థన అంనతరం ముస్లిం భక్తులు ఇతేకాఫ్ దీక్ష చేపట్టారు. ప్రాపంచిక బహ్య వ్యవహారాలన్ని త్యజించి దైవ నామ స్మరణతో అదనపు నమాజులు, ఖుర్‌ఆన్ పారాయణం చేస్తారు. దీనినే ఏతేకాఫ్ అంటారు. ఏతేకాఫ్ అనేది ఏకాంత ఆరాధన. ఈ పది రోజల దైవరాధన ఎనలేని ఆత్మబలాన్ని నిస్తుంది. ఈ మాసంలో ఏతేకాఫ్ దీక్షల పాటించిన భక్తులు లోక కళ్యాణాన్ని ఆకాంక్షిస్తూ, (ప్రజా సంక్షేమాన్ని) చెడులకు దూరం ఉండేలా, సన్మార్గంలో నడించేందుకు ఈ దీక్షను పాటించటం విధిగా బావిస్తారు. ఈ పది రోజులు దీక్ష పాటిస్తున్న భక్తులు మసీదులో వారికి అన్నపానీయాలు బంధుమిత్రులు, ఇతర ముస్లీం భక్తులు, కుటుంబ సభ్యులు అందిస్తారు. ఈ దీక్షలో ఉపవాసదీక్ష పరుల ఎస్ఏ ఎం ఖాద్రీ, మహమ్మద్ ఏజాజ్, పఠాన్ మదస్సిర్, ఖలీల్‌బాబ, ఎస్‌కే షాహిద్‌పాషా, ఎండిఇజ్జర్, ఎస్‌కే షమీర్ ఆశీనులైనారు.

ముస్లింలకు రంజాన్ కిట్స్ పంపిణీ

ఖమ్మంసాంస్కృతికం: రంజాన్‌మాసాన్ని పురస్కరించుకొని విజేత ఫౌండేషన్ అధినేత్రి, మహిళా ప్రాంగణం అధికారి వేల్పుల విజేత ఆధ్వర్యంలో నగరంలోని 65మంది నిరుపేద ముస్లింలకు, పీటర్ నాయక్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ లకావత్ పీటర్‌నాయక్ ఆధ్వర్యంలో 45మంది నిరుపేద ముస్లింలకు ఆదివారం రంజాన్‌కిట్స్ అందచేశారు. ఈ కార్యక్రమంలో జానీపాషా, భూక్యా ఉపేందర్, ముస్లిం మహిళలు పాల్గొన్నారు.

'చంద్రాయపాలెం ఘటనలకు కారణం పాలకులే'

సత్తుపల్లి, మార్చి31: మండలం చంద్రాయపాలెంలో ఆదివారం చోటుచేసుకున్న ఘటనకు కారణం పాలకులేనని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు ఒక ప్రకటనలో ఆరోపించారు. బుగ్గపాడు, చంద్రాయపాలెం రైతులకు పట్టాలు ఉండటంతో ఈ సమస్య జఠిలంగా మారిందని, ఎన్నో ఏళ్లుగా రెవెన్యూ అధికారులకు తెలియజేసినప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం విచారణ కమిటీ వేసి పట్టాలున్న భూములను ప్రజలకు పంచాలని ఆయన కోరారు.

పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మంలో బీజేపీదే విజయం

- రాష్ట్ర సంఘటన మంత్రి చంద్రశేఖర్

ఖమ్మంబైపాస్‌రోడ్, మార్చి31: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మంలో బీజేపీ విజయకేతనం ఎగురవేసి, చరిత్ర సృష్టించబోతున్నదని బీజేపీ రాష్ట్ర సంఘటన మంత్రి చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఒక ప్రయివేట్ హోటల్‌లో జరిగిన బీజేపీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ సొంతంగా 370 స్థానాల్లో గెలుస్తుందని అందులో ఖమ్మం సీటు కూడా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు మాట్లాడుతూ తనకు ఒక్క అవకాశం ఇచ్చి గెలిపిస్తే... ప్రధాని నరేంద్రమోదీ ద్వారా ఎన్నో పథకాలు జిల్లాకు తెచ్చి సమగ్రంగా అభివృద్ధి చేస్తానన్నారు. కార్యకర్తల పథకాలను ప్రచారం చేయాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ మార్తినేని ధర్మారావు, ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ ప్రచారక్ శ్రీకాంత్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు రంగా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఎంట్రెన్స్‌లో సీటు సాధించిన చిలుకూరు విద్యార్థి

మధిరరూరల్, మార్చి 31: శనివారం విడుదల చేసిన సెంటర్ ఆఫ్ఎక్స్‌లెన్స్ ఎంట్రెన్స్ ఫలితాల్లో మధిర మండలం చిలుకూరు గ్రామానికి చెందిన కుక్కల అభిషేక్‌కు సీటు సాధించాడు. హైదరాబాద్ గౌలిదొడ్డి సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో రెండు లెవల్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చి సీటు సాధించాడు. రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా ఉన్న ఈ కళాశాలలో సీటు సాధించాడు. ఐఐటీ,జేఈఈ, ఎంసెట్‌లో ఉత్తమ శిక్షణ ఇవ్వబడుతుంది.

పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడిగా యలమద్ది

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి31: పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడిగా యలమద్ది వంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈదివారం సంఘం జిల్లా కార్యాలయంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ సమక్షంలో వెంకటేశ్వర్లును నూతన జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గెజిటెడ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు మోతుకూరి మధు, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారావు పాల్గొన్నారు.

వైరా రాజకీయాల్లో నైరాశ్యం

- బీఆర్ఎస్‌లో అభ్యర్థిని ప్రకటించినా ఇదే పరిస్థితి
- కాంగ్రెస్‌లో అభ్యర్థిని ఎవరో తెలియక అయోమయం

వైరా, మార్చి31: లోక్‌సభ ఎన్నికల తేదీలు ప్రకటించినా వైరా నియోజకవర్గంలో మాత్రం రాజకీయ నైరాశ్యం నెలకొంది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ, వామపక్ష పార్టీల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గానికి కాంగ్రెస్ అభ్యర్థిని ఖరారు చేసే విషయంలో అధిష్టానం నిర్ణయానికి రాలేదు. బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రస్తుత ఖమ్మం ఎంపీ, ఆపార్టీ లోక్‌సభ పక్ష నాయకుడు నామా నాగేశ్వరరావు పేరును అధినేత కేసీఆర్ ప్రకటించినప్పటికీ, ఆపార్టీలో కూడా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న రీతిలో ఉంది. కేంద్రంలో పదేళ్ల నుంచి అధికారంలో ఉన్న బీజేపీ మూడోసారి అధికారాన్ని చేపట్టి హ్యాట్రిక్ సాధించాలని ఉవ్విళ్లురుతూ ఖమ్మంలో తమ పార్టీ అభ్యర్థిగా తాండ్ర వినోదరావును ప్రకటించినప్పటికీ ఎలాంటి కదలిక కన్పించటం లేదు. వామపక్షాల పరిస్థితి కూడా ఇదేవిధంగా ఉంది. ఏప్రిల్‌లో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చి మే 13న ఎన్నికలు జరుగనున్నాయి.

ఎండతీవ్రత పెరుగుతున్నా.. కానరాని రాజకీయ కాక

ఓవైపున రోజురోజుకు ఎండతీవ్రత పెరుగుతున్నప్పటికీ ఎన్నికల సమయం సమీపిస్తున్నప్పటికీ రాజకీయ పార్టీల్లో మాత్రం నైరాశ్యం నెలకొని ఉంది. గత ఏడాది నవంబరు 30న జరిగిన ఎన్నికల్లో వైరా నియోజకవర్గంలో తొలిసారి కాంగ్రెస్ అభ్యర్థి మాలోతు రాందాస్‌నాయక్ భారీ మెజార్టీతో విజయం సాధించారు. వైరాకు చెందిన మధిర ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని ఎంపీ టిక్కెట్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తుండగా ఆమెకు ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మద్దతుగా ఉన్నారు. మరోవైపు జిల్లాకే చెందిన మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు సోదరుడు, తనయుడు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి, తుమ్మల యుగంధర్ కూడా ఎంపీ టిక్కెట్ రేసులో ఉన్నప్పటికీ ఎమ్మెల్యే మాత్రం నందినికే జైకొట్టారు. ఇటీవల ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ప్రజాపాలన గ్రామసభల్లో పాల్గొన్నారు. ఆతర్వాత నియోజకవర్గంలోని పలుచోట్ల శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు తదితర అభివృద్ధి కార్యక్రమాలకు హాజరయ్యారు. రూ.వందకోట్లతో చేపట్టిన సీతారామ లింక్ కెనాల్ నిర్మాణానికి వైరాలో మంత్రులు శంకుస్థాపన చేశారు. ఆతర్వాతఎన్ఆర్ఈజీఎస్ కింద ఎమ్మెల్యే సిఫార్సు మేరకు రోడ్లు కూడా నిర్మించారు. ఎన్నికల షెడ్యూల్ రావడంతో ఎమ్మెల్యే ఎక్కువ సమయంలో హైదరాబాద్‌కే పరిమితమయ్యారు. ఇంకా అభ్యర్థి ఎవరో తెలియని పరిస్థితుల్లో కాంగ్రెస్ శ్రేణులు నిత్తేజంగా ఉన్నాయి.

బీఆర్ఎస్ అభ్యర్థిని ప్రకటించినా..

ఇకపోతే బీఆర్ఎస్‌లో పూర్తి నైరాశ్యం నెలకొంది. నామా నాగేశ్వరరావును అభ్యర్థిగా ప్రకటించినప్పటికీ ఇక్కడ ఇంతవరకు ఎలాంటి కదలిక లేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమిపాలైన మాజీఎమ్మెల్యే బాణోతు మదన్‌లాల్ ఇటీవల కవితను అరెస్టు చేసిన సమయంలో పార్టీ పిలుపు మేరకు వైరాలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. బీఆర్ఎస్‌కే చెందిన మాజీ ఎమ్మెల్యేలు లావుడ్యా రాములునాయక్, చంద్రావతి అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. రాములునాయక్ మాత్రం అడపాదడపా ప్రైవేట్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బీజేపీ బలం వైరాలో అంతంతమాత్రమే కావడంతో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించటం లేదు. తెలుగుదేశం పార్టీ నాయకత్వం మాత్రం ఇటీవల ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ స్థాయిలో వైరాలో సమావేశాన్ని నిర్వహించి పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నిర్ణయం మేరకు నడుచుకోవాలని నిర్ణయించారు. అంతకుమించి ఎలాంటి కార్యక్రమాలు లేవు. ఇక వామపక్షాలు, మిగిలిన అన్ని పార్టీలు కూడా సైలెంట్‌గా ఉండిపోయాయి.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు

సత్తుపల్లిరూరల్, మార్చి31: ఏసు పునరుత్థానుడై తిరిగి లేచిన పర్వదినం ఈస్టర్ సందర్భంగా క్రైస్తవులు వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మానవాళి కోసం శిలువలో ప్రాణత్యాగం చేసిన ఏసుక్రీస్తు చనిపోయిన మూడవ రోజు సమాధి నుంచి సజీవంగా తిరిగిలేచాడని బైబిల్ చెబుతున్నట్లు దైవజనులు ఆయా చర్చీలలో ఉపదేశించారు. ఈస్టర్ పండుగకు ముందు 40రోజుల పాటు క్రైస్తవులు ఉపవాసం ఆచరించగా ఈస్టర్ పర్వదినం రోజు ముగుస్తుందని, ఇన్నిరోజుల పాటు ఉపవాసం ఉండి పొదుపు చేసిన ఆహార పదార్థాలు, నగదును పేదలకు దానమిచ్చారు. చర్చీలను అందంగా అలంకరించగా క్రైస్తవులకు ఈస్టర్ శుభాకాంక్షలు పలువురు తెలిపారు.

మధిర: ఈస్టర్ వేడుకలను ఆదివారం మధిరలో క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. మధిర పట్టణంలోనూ, మండలంలోని పురాతన చర్చిలల్లోనూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మధిరలోని తెలుగు బాప్టిస్టు చర్చి, ఆర్సీఎం చర్చి, పెంతికోస్తు చర్చితదితర చర్చిలతోపాటు మండలంలోని దేశినేని పాలెం, బయ్యారం తదితర పురాతన చర్చిలల్లోనూప్రత్యేక ప్రార్థనలుచేశారు.

ఖమ్మం సాంస్కృతికం: ఈస్టర్ పండుగ వేడుకలను ఆదివారం ఖమ్మం నగరంతోపాటు జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. ఏసు ప్రభువు శిలువ త్యాగం చేసిన అనంతరం మరలా పునరుత్థానం చెందిన పవిత్ర దినాన్ని ఈస్టర్ పండుగగా జరుపుకున్నారు. ఉదయంనుంచి పాస్టర్లు ప్రార్థనలు జరిపారు.

తల్లాడ: తల్లాడ మండలంలో ఆదివారం క్రైస్తవులు ఈస్టర్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. స్థానిక లూర్దుమాత చర్చిలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ఈస్టర్ వేడుకలు జరిగాయి. ఏసుక్రీస్తు పునర్‌స్థానం పొందిన సందర్భంగా కొవ్వొత్తులు వెలిగించి స్వాగతం పలికారు. ఈస్టర్ కేక్ కట్‌చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. దివ్యబలిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో విచారణ గురువులు పాదర్ అజయ్, పాదర్ ప్రాన్సీస్, పాదర్ మనోజ్, పాదర్ మరియన్న పాల్గొన్నారు.

వరలక్ష్మీ మృతికి పలువురి నివాళి

వైరా, మార్చి 31: వైరా మునిసిపాలిటీ ఏడోవార్డులోని బ్రాహ్మణపల్లి అగ్రహారంలో కాంగ్రెస్ నాయకుడు పణితి సైదులు మాతృమూర్తి వరలక్ష్మీ(75) గుండెపోటుతో ఆదివారం తెల్లవారుజామున హఠాన్మరణం చెందారు. ఏడోవార్డు కౌన్సిలర్ పణితి ఉష అత్తగారైన వరలక్ష్మీ హఠాన్మరణం చెందారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లు సూతకాని జైపాల్, ముళ్లపాటి సీతరాములు, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, కోసూరి శ్రీనివాసరావు, పాలేటి నర్సింహారావు, బోళ్ల గంగారావు, పమ్మి అశోక్, కన్నెగంటి నగేష్, పోటు మధు, పెద్దప్రోలు లక్ష్మయ్య, విశ్రాంతి ఎస్ఐ బి.రామకృష్ణ పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

తల్లాడ, మార్చి 31: తల్లాడ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, నాగపద్మ దంపతుల పెండ్లిరోజు సందర్భంగా ఆదివారం 30మందికి సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ నిర్వాహకులు మిట్టపల్లి నర్సింహారావు, నంబూరి కనకదురాప్రసాద్, కర్నాటి లక్ష్మారెడ్డి, దగ్గుల రాజ శేఖర్‌రెడ్డి, బెల్లంకొండ ఆంజనేయులు, కటికి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి

ఖమ్మం ఖానాపురంహవేలి మార్చి 31: ఉపాధ్యాయుల పెండిగ్ బిల్లులు సుమారు 3వేల కోట్లను వెంటనే విడుదల చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం నగరంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన హజరై మాట్లాడారు.

ధాన్యానికి బోనస్ చెల్లించాలి

వైరా, మార్చి 31: ఈ యాసంగి వ్యవసాయ సీజన్ నుంచే వరి ధాన్యం క్వింటా ఒక్కింటికి రూ.500బోనస్ చెల్లించాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. రైతుబంధు డబ్బులు వందశాతం రైతుల బ్యాంకుఖాతాల్లో జమచేయాలని, ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ.25వేలు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఆదివారం వైరాలో జరిగిన స్టడీ సర్కిల్‌లో ఆయన ప్రసంగించారు. ధరణి అలాగే రైతుబంధుపై రైతు సంఘాలు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని డిమాండ్ చేశారు. మాజీ ఎంపీపీ బొంతు సమత, నాయకులు తోట నాగేశ్వరరావు, పారుపల్లి కృష్ణారావు, అమరేంద్ర, మధు, నాగరాజు పాల్గొన్నారు.

ఎన్నికల నియామవళిపై ఫ్లెక్సీలు

వైరా,మార్చి31: లోక్‌సభ ఎన్నికల ప్రవర్తనా నియామవళిపై అవగాహన కల్పిస్తూ మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. మునిసిపాలిటీలోని ప్రధాన రహదారులు, బస్టాండ్, ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార కూడళ్లలో ఈ ఫ్లెక్సీలను ఏర్పాటుచేశారు. మునిసిపల్ కమిషనర్ సీహెచ్.వేణు ఈ ఫ్లెక్సీల ఏర్పాటును స్వయంగా పర్యవేక్షించారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ షేక్.సైదులు, మునిసిపల్ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ కుటుంబానికి పరామర్శ

కామేపల్లి, మార్చి 31: ముచ్చర్ల గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ శతకోటి వీరనాగులు అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదివారం పరామర్శించారు.

గుదిమళ్లలో బోనాల పండుగ

ఖమ్మంరూరల్, మార్చి31: మండల పరిధిలోని గుదిమళ్ల గ్రామంలోని తిరుపతమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న జాతరలో ఆదివారం బోనాల పండుగ వేడుకలు నిర్వహించారు. చివరి రోజు అమ్మవారికి బోనాలు సమర్పిస్తారు.